
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

ఆదివారం 11 మే 2025



ఉష్ణోగ్రత (అంచనా)

11-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	41	27
తెనాలి	40	28
నరసరావుపేట	40	27
బాపట్ల	38	28
రెంటచింతల	40	28
చీరాల	38	28

ఆరంచెలపై అసంతృప్తి

- రేషన్ కార్డులకు పాత విధానంలోనే మూల్యాంకనం
- గతంలో వివిధ కారణాలతో రద్దు అయిన వారే మళ్లీ దరఖాస్తు
- గతంలో ఏ ప్రభుత్వం ఇలా మూల్యాంకనం చేయలేదంటున్న పేదలు



గుంటూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నో నెలలుగా రేషన్‌కార్డుల కోసం పలువురు ఎదురు చూస్తున్నారు. దీంతో వందల సంఖ్యలో పేదలు దరఖాస్తులతో గ్రామ, వార్డు సచివాలయాల బాట పడుతు న్నారు. అయితే కొత్తగా రేషన్‌కార్డుల దరఖాస్తులు స్వీకరించే విషయంలో సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్ (ఆరు అంచెల మూల్యాంకనం)ని ప్రభుత్వం యథాతథంగా కొనసాగిస్తున్నది. గ్రామ/వార్డు సచివాల యాల్లో ఈ నెల 7 నుంచి సెక్రటరీలు రేషన్‌కార్డు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. నూతన రేషన్ కార్డుల జారీ, కార్డులో సభ్యుల విభజన, చిరు నామా మార్పు, కొత్త సభ్యులను చేర్చడం, ఉన్న వారిని తొలగించడం, కార్డులను సరెండర్ చేసే సర్వీసులకు అప్లికేషన్లు తీసుకోవాలని ప్రభుత్వం సచివాలయాల కార్యదర్శులను ఆదేశించింది. అయితే వాటిని ఆన్ లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి నవశకం బెనిఫీషియరీ మేనేజ్‌మెంట్ (ఎన్‌బీఎం) లాగిన్‌లోకి వెళ్లి ఈ మూల్యాంకనంలో అర్హత సాధించారా, లేదా అనేది పరిశీలిస్తున్నారు. ఆ తర్వాతనే దరఖాస్తుని అప్‌లోడ్ చేస్తున్నారు. వైసీపీ హయాంలో జరిగిన తప్పులను సరి చేయడం లేదు. అదేమంటే సంబంధిత డిపార్టు మెంట్‌కు వెళ్లి లేఖ తెచ్చుకోవాలని సెక్ర టరీలు సల హా ఇస్తున్నారు. అప్పుడు ఆ లెటర్‌తో పాటు అప్లికేష న్‌ని ప్రభుత్వానికి ఆన్‌లైన్‌లో పంపుతా మంటున్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి మూల్యాంకనం చేయలేదు. కేవలం ఆదాయం ధ్రువీకరించుకుని కార్డు జారీ చేసే వారు. ఇప్పటి వరకు దారిద్ర్య రేఖకు దిగువన ఉంటూ రేషన్ కార్డు లేని కుటుంబాలు లేవు. ప్రస్తుతం వస్తున్న దరఖాస్తులన్నీ గతంలో వివిధ కారణాలతో రద్దు చేసిన వాటిల్లోని సభ్యులేతా జాగా దరఖాస్తులు పెడుతున్నారు. సిటిజన్ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ డేటాలో చనిపోయిన వారి వివరాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పేర్లను తొలగిస్తున్నారు. ఇప్పుడు సచివాలయాల్లో సిబ్బంది చేస్తున్నదల్లా కొత్తగా సభ్యులు చేర్పు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, చిరునామాల మార్పు దరఖాస్తులను మాత్రమే ప్రాసెసింగ్ చేస్తున్నారు.

తప్పులను సవరించకుండానే..

గతంలో ఆరు అంచెల మూల్యాంకనంతో గుం టూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో వందల సంఖ్యలో కార్డులను తొలగించారు. అనర్హులుగా తేల్చిన అంశాలు తమకు వర్తించవని ఆయా కార్డుదారులు అప్పట్లో సచివాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం రేషన్ కార్డులకు అవకాశం వచ్చిందని.. ఆ తప్పులను సవరించి కొత్తగా కార్డులు ఇస్తారని పలువురు భావించారు. అయితే ఆ తప్పుల సవరణలకు అవకాశం ఇవ్వకుండా.. పాత విధానంలోనే మూల్యాంకనంపై పేదలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లు ఆరు నెలల సగటు వాడకం 300 యూనిట్ల కంటే అధికంగా ఉందని, ఆదాయ పన్ను చెల్లిస్తున్నారని, కారు ఉందని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తులున్నాయని, ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నారని వంటి కారణాలు చూపించి పెద్దసంఖ్యలో రేషన్ కార్డులు తొలగించారు. దీంతో వివిధ సంక్షేమ పథకాలకు కూడా వారంతా అనర్హులయ్యారు. దీని వల్ల అప్పట్లో గందరగోళం తలెత్తింది. ముఖ్యంగా ఒకే పేరుతో రెండు, మూడు విద్యుత్ మీటర్లుంటే వాటిని ఒకటిగా లెక్కించి అనర్హత వేటు వేశారు. బ్యాంకు రుణం కోసం ఐటీ కడితే అనర్హులుగా చేశారు. పట్టణ ప్రాంతాల్లో రెండు అంతస్తుల ఇల్లు ఉంటే కింద, పైన కలిపి ఎస్‌ఎఫ్‌టీని లెక్కించి ప్రభుత్వం అనుమతించిన దాని కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇల్లు ఉందని పేర్కొంటూ కార్డులు తొలగించారు. వీటిని సరి చేసుకునేందుకు అవకాశం లేకుండా పాత విధానాన్ని ప్రభుత్వం అవలంబిస్తుం డటంపై దరఖాస్తుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తు న్నారు. ఇన్‌కం ట్యాక్స్ కట్టే పిల్లలు పెళ్లి చేసుకుని వేరుపడిపోయారని, ఇప్పుడు వారి పేర్లను తొలగించమని దరఖాస్తు చేస్తే ఆమోదించడం లేదని పలువురు తెలిపారు. ఇన్‌కంట్యాక్స్ విషయంలో సంబంధిత శాఖ నుంచి లెటర్ తీసుకురమ్మంటు న్నారని, ఆ డిపార్టు మెంట్‌లోకి అడుగు పెట్టడమే కష్టమైతే, అక్కడి నుంచి లెటర్ ఎలా తీసుకురాగలమని ప్రశ్నిస్తున్నారు.

తుది దశకు.. సీఆర్డీఏ కార్యాలయం



- శరవేగంగా ఇంటీరియర్ పనులు
- 3000 చ.మీ. విస్తీర్ణంలో కాన్ఫరెన్స్ హాలు
- కార్యాలయానికి అనుబంధంగా మూడు భారీ నిర్మాణాలు
- మరో నెలలో అమరావతి నుంచి సీఆర్డీఏ కార్యకలాపాలు

గుంటూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): దాదాపు ఆరేళ్ల క్రితం ఆగిపోయిన సీఆర్డీఏ కార్యాలయం త్వరలో అందుబాటులోకి రానుంది. మరో నెలలో రాజధాని అమరావతి నుంచే సీఆర్డీఏ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. రాజధానిలో ముమ్మరంగా పనులు ప్రారంభమైన నేపథ్యంలో విజయవాడలోని కార్యాలయం నుంచి కార్యకలాపాలు చేయడం అధికారులకు కొంచెం కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో శరవేగంగా కార్యాలయ పనులు పూర్తి చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో గడిచిన నెల రోజులుగా రోజుకు 500 మందికి పైగా కార్మికులు నిర్విరామంగా పనిచేస్తుండడంతో భవన నిర్మాణం దాదాపు తుది దశకు చేరింది. రాజధాని నిర్మాణంలో అత్యంత కీలకమైన సీఆర్డీఏ కార్యాలయ పనులు వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం సీఆర్డీఏ కార్యాలయ నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. దీంతో సీఆర్డీఏ కార్యాలయాన్ని ఈ నెలాఖరులోగా అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో నిర్మాణ సంస్థకు పనులు పురమాయించింది. ప్రతి రోజూ 500 మందికి పైగా కార్మికులు, ఇంజనీర్లు, టెక్నీషియన్లు పనిచేసి బిల్డింగు నిర్మాణాన్ని తుది దశకు తీసుకువచ్చారు. బిల్డింగు వెలుపల భాగంలో అద్దాల ఏర్పాటు దాదాపుగా పూర్తయింది. పై భాగంలో జరిగే పనుల కోసం భారీ క్రేన్‌ను రప్పించి పనులు చేస్తున్నారు.



కార్యాలయంలో జరుగుతున్న సీలింగ్ పనులు

చురుగ్గా ఇంటీరియర్ పనులు

సీఆర్డీఏ కార్యాలయ భవనం వెలుపల పనులకు సమాంతరంగా లోపల పనులు కూడా పూర్తవుతున్నాయి. ఇప్పటికే అన్ని ఫ్లోర్లలో విద్యుత్ కనెక్షన్లు, ఫైర్‌సేఫ్టీ పైపులు, సెంట్రల్ ఏసీ ఏర్పాటు, ఉద్యోగుల గ్లాస్ ఛాంబర్ల పనులు దాదాపుగా పూర్తయ్యాయి. భవనంలోని 3, 4 ఫ్లోర్లలో సీలింగ్ పనులు జరుగుతున్నాయి. భవనంలో వృత్తాకారంలో మెట్ల వరుస పూర్తయింది. కాగా ప్రతి ఫ్లోర్లో హాలు భాగంలో సీలింగును కలపతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. అన్ని ఫ్లోర్లలో ఫ్లోరింగ్ కూడా పూర్తయింది.

అనుబంధ నిర్మాణాలు

సీఆర్డీఏ కార్యాలయానికి వెనుక భాగంలో ఇనుప స్తంబాలు, రేకులతో భారీ నిర్మాణాన్ని చేపట్టారు. అది దాదాపుగా పూర్తయింది. భవనానికి ముందు భాగాన కూడా ఇలాంటి నిర్మాణాలు చేపడుతున్నారు. లింగాయపాలెం సరిహద్దుల్లో సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన ఈ నిర్మాణాలను ఒక్కొక్కటి 3 వేల చదరపు మీటర్ల విస్తీర్ణం ఉండేలా విశాలంగా నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాలో ఫ్లోరింగ్ పనులు వేగంగా జరుగుతున్నా యి. ఇనుము, కాంక్రీటుతో ఫ్లోరింగ్ వేస్తున్నారు. ఇప్పటికే ఆ నిర్మాణం పూర్తి కావస్తుండగా, మరో నిర్మాణాన్ని ప్రారంభించారు.



కార్యాలయంలో జరుగుతున్న ఇంటీరియర్ వర్క్

నిందితులకు శిక్షలు పడాలి

- కేసుల విచారణను వేగవంతం చేయాలి
- పోలీసులను ఆదేశించిన ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, మే 10 (ఆంధ్రజ్యోతి): తగిన ప్రణాళికలు రూపొందించి, సంబంధిత పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, కోర్టుల్లో సాక్ష్యాధారాలను సమర్పించి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. పోలీసు కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్‌స్టేషన్లకు సంబంధించి న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న కేసుల విచారణను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్ల జారీపై శ్రద్ధ వహించాలన్నారు. వివిధ కేసుల్లోని నిందితులు, రౌడీషీటర్లను కోర్టుల్లో హాజరు పరచాలన్నారు నిందితుల జాడ తెలియని పక్షంలో షూరిటీ ఇచ్చిన వారిని కోర్టుకు హాజరు పరచాలన్నారు. హత్య, హత్యాయత్నం, పోక్సో, అత్యాచార కేసుల విచారణను వేగవంతం చేసి నిందితులకు శిక్షలు ప డేటట్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మాదకద్రవ్యాల కేసుల్లోని నిందితులకు శిక్షలు పడేలా చేస్తే మరొకరు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉంటారన్నారు. సమావేశంలో ఏఎస్పీసంతోష్, డీసీఆర్‌బీ సీఐశ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

ఉపాధ్యాయ.. బదిలీలకు వేళాయే

- రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల?
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 4,000 మందికి పైగా స్థానచలనం
- మార్గదర్శకాలు విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ
- ప్రాథమిక సమాచారం ఆధారంగా నివేదిక సిద్ధం చేసిన అధికారులు

గుంటూరు(విద్య), మే 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ పరిస్థితుల్లో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి బదిలీలకు అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని విద్యాశాఖ అధికారులు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ జడ్పీ, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పరిధిలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయుల కేటగిరిలో దాదాపు 13 వేల మందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో దాదాపు 2000 మందికి పైగా ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. మరో రెండు వేల మందికి అర్హతలను బట్టి బదిలీలు జరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. రెండు మూడు రోజుల్లో బదిలీలకు సంబంధించిన పూర్తిస్థాయి నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ప్రధానోపాధ్యాయులు(గ్రేడ్-2), ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ అవనున్నారు.



మార్గదర్శకాలు ఇలా..

- ఏదైనా పాఠశాలలో ఐదు విద్యా సంవత్సరాలు పూర్తి చేసిన గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, ఏదైనా పాఠశాలలో 8 విద్యా సంవత్సరాలు పూర్తి చేసిన ఉపాధ్యాయులకు బదిలీలు ఉంటాయి.
- కనీసం రెండు విద్యా సంవత్సరాలు పని చేసిన వారి బదిలీకి అవకాశం ఉంది.
- ఏ విద్యా సంవత్సరంలో అయినా మే 31 నాటికి 9 నెలలు పనిచేస్తే అది పూర్తి విద్యా సంవత్సరంగా పరిగణిస్తారు.
- రెండేళ్లలో ఉద్యోగ విరమణ చేసే వారు తమ కోరిక మేరకు మాత్రమే బదిలీ అవుతారు.
- 50 ఏళ్ల లోపు పురుష ఉపాధ్యాయులు, గర్ల్స్ హైస్కూల్‌లో పని చేస్తే తప్పనిసరిగా బదిలీ చేయాలి.
- మహిళా ఉపాధ్యాయులు లేని పరిస్థితుల్లో, 50 ఏళ్లు పైబడిన పురుష ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వవచ్చు.
- ఎన్‌సీసీ అధికారులైన వారిని సంబంధిత యూనిట్ ఉన్న పాఠశాలకు బదిలీ చేయాలి.
- లైంగిక వేధింపుల(పోస్కో) కేసులు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులను బాలికల పాఠశాలల్లో లేకుండా ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలి.

పాయింట్లు ఇలా..

ఉపాధ్యాయులు మే 31 నాటికి చేసిన సేవ ఆధారంగా పాయింట్లు కేటాయిస్తారు ఇందులో మొత్తం ఐదు పాయింట్లు ఉంటాయి.

- జంట ఉద్యోగులుగా ఉన్న దంపతులకు ఐదు పాయింట్లు
- 40 ఏళ్లు దాటి పెళ్లి కాని మహిళా ఉపాధ్యాయులకు ఐదు పాయింట్లు
- శారీరక, మానసిక లోపాలతో ఉన్న వారికి 5-7 పాయింట్లు(లోప శాతం ఆధారంగా)
- బాధ్యతాయుతమైన సంఘాల నాయకులు (ఉద్యోగ సంఘాలు) ఐదు పాయింట్లు
- ఐదేళ్ల కంటే తక్కువ జ్ఞాన థలసీమియా, డయాలసిస్ వంటి వ్యాధులతో బాధపడేవారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు.

ప్రాధాన్య కేటగిరీలు ....

- 100% చూపు లోపం లేదా 80% పైగా శారీరక లోపం, 75% చూపు లోపం లేదా 70% పైగా వినికిడి లోపం, విడాకులు తీసుకున్న మహిళలు (పునర్వి వాహం అయితే వర్తించదు).
- తీవ్రమైన అనారోగ్యం ఉన్నవారు(క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, మొదలైనవి).
- జువనైల్ డయాబెటిస్, థలసీమియా సంతానం ఉంటే ప్రాధాన్యం ఇస్తారు.

అవినీతి లేకుండా సీఎంఆర్‌ఎఫ్ సాయం

- 58 లక్షల చెక్కుల పంపిణీలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆపద, అవసరంలో ఉన్న వారికి లంచం అన్నమాటకు తావులేకుండా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వేగంగా సాయం అందుతుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గంలోని 63 మంది లబ్ధిదారులకు రూ.58,11,530 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ సాయం అందుకునే విషయంలో ఎవరికైనా ఎలాంటి ఇబ్బంది వచ్చినా నేరుగా తనను సంప్రదించాలన్నారు. సీఎంఆర్‌ఎఫ్ వినతులను మానవతా దృక్పథంతో, వీలైనంత వేగంగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే సూచిస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. అడిగిందే తడవుగా అవసరంలో ఉన్న ప్రతిఒక్కరికీ పారదర్శకంగా సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, మక్కెన

మిర్చి దాచేదెలా ?

- పల్నాడులో స్టోరేజ్‌లన్నీ ఫుల్
- గ్రామాల్లో అందుబాటులోలేని గిడ్డంగులు



పిడుగురాళ్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు అంటేనే మిరప పంటకు బ్రాండ్ అంబాసిడర్. కొత్తరకం వంగడాలతో అధునాతన సాగుతో అధిక దిగుబడులు సాధించేందుకు ఇక్కడి రైతులు పోటీ పడతారు. అయితే ఈ ఏడు అటు ధర లేక.. ఇటు నిల్వ చేసుకునే ఆస్కారం లేక రైతులు అల్లాడుతున్నారు. మిరప పంట నిల్వ కష్టాలతో అయినకాడికి తెగనమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేముందు ప్రతి గ్రామంలో పంట నిల్వ చేసుకునేందుకు గిడ్డంగుల సౌకర్యం ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ పల్నాడు ప్రాంతంలో ఎక్కడా అమలు కాలేదు. రైతులు పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే సౌకర్యం లేక ఇళ్లల్లో దాచుకోలేక ఎప్పటికప్పుడు అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తుంది. దీంతో రైతు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితులు ఏర్ప డుతున్నాయి. ప్రస్తుతం ఈ ఏడాది మిరప పంట అధిక దిగుబడి రావడంతో ఆశించిన ధర లేక రైతులు మాచర్ల, గురజాల నియోజకవర్గాల పరిధిలోని 22 కోల్డ్ స్టోరేజ్‌లలో ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు తగిన సామర్థ్యం లేక గుంటూరుకు తరలించుకుపోవాల్సి వస్తోంది. అదే తమ ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజీలు అందుబాటులో ఉంటే ఇక్కడే నిల్వ చేసుకుని ఉండేవాళ్లమని రైతులు చెప్తున్నారు.

గుంటూరు వరకు వెళ్లాల్సి వస్తోంది..

పల్నాడు నుంచి 100 కిలోమీటర్లు ఉన్న గుంటూరుకు వెళ్లి అక్కడి కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేయాలంటే దూరాభారమవుతోందని రైతులు వాపోత ున్నార ు. ధర వచ్చే వరకు నిల్వ చేసుకుని ఆ తర్వాత అమ్ముకునే క్రమంలో ఎన్నో ఇబ్బందులు పడిన రైతులు ఉన్నారు. 2014-19 మధ్య ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దాచేపల్లిలో మిర్చి కొనుగోలు కేంద్రం ఏర్పాటుతో రైతులకు ప్రయోజనం చేకూరింది. ఆ తర్వాత నుంచి నడికూడి మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళ్లు జరుగుతున్నాయి. అయితే ఈ ఏడాది అనూహ్యంగా పంట దిగుబడి ఎకరాకు 30 నుండి 40 క్వింటాళ్లు రాగా ధర చూస్తే ఆశించనంత లేదు. దీంతో రైతులు కోల్డ్ స్టోరేజ్‌లో మిర్చిని నిల్వ చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ఆశించిన ధర వచ్చాక విక్రయించవచ్చనే ఆలోచనతో రైతులు మిరప పంటను గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలోని 22 కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచారు. పల్నాడు ప్రాంతంలోని కోల్డ్‌స్టోరేజ్‌ల్లో పంట నిల్వ ఎంత భద్రమో రైతులకు తెలియడంలేదు. 100 కిలోమీటర్ల దూరంలో వున్న గుంటూరుకు వ్యయప్రయాసలతో రావాణా చేసి వెళ్లటమంటే రైతులకు ఎంతో ఇబ్బందిగా ఉంది.

గ్రామాల్లో ఏర్పాటు చేయాలి



గిట్టుబాటు ధర వచ్చేదాక పంట ఉత్పత్తులను నిల్వచేసుకునేందుకు గ్రామాల్లో ఎక్కడికక్కడ మినీ గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. పల్నాడులోని కోల్డ్‌స్టోరేజ్‌లు ఖాళీలేక గుంటూరుకు వెళ్లాల్సి వస్తుంది. ఒక్కోసారి రాకపోకల సమయంలో రవాణా ఖర్చులు, ఇబ్బందులను ఎదుర్కొనాల్సి వస్తుంది. దిగుబడులు ఎక్కువగా వస్తున్న ప్రాంతాల్లో గిడ్డంగి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలి.

- దావులూరి నాగాంజనేయులు, రైతు

అలరించిన ఆహ్వాన నాటిక పోటీలు

పొన్నూరుటౌన్, మే 10: పొన్నూరు పట్టణంలోని పొన్నూరు కళా పరిషత్ ఆధ్వర్యంలో నాలుగురోజుల పాటు నిర్వహించిన 24వ ఉభయ తెలుగురాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు అలరించాయి. శనివారం చివరిరోజు బోయపాటి హేమలత కళా ప్రాంగణంలో చెల్లా దేవాన్ని నాయుడు శాస్త్రీయ నృత్యంతో నాటిక పోటీలు ప్రారంభం అయ్యాయి. పీటీ మాధవ్ రచనలో గోకరాజు విజయ్ దర్శకత్వంలో శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు నాటికను ప్రదర్శించారు. జీవితంలో రైలు



జనరల్ బోగీలు నాటికలోని ఓ సన్నివేశం

ప్రయాణం చేయని సామాన్యులు ఉండరు. జనరల్ బోగీలలో ప్రయాణించే సామాన్యుల ఇబ్బందుల గురించి ఇతివృత్తంతో జనరల్ బోగీలు నాటికను ప్రదర్శించారు. జనరల్ బోగీలో ప్రయాణికుల పరిస్థితి, రైలు ప్రమాదాలు జరిగినపుడు జనరల్ బోగీలలో ప్రయాణిస్తున్న మృతుల కుటుంబాలకు జరుగుతున్న అన్యాయం ఇతివృత్తాంతంగా సావిత్రమ్మ అనే సామాన్యురాలు చేసిన న్యాయ పోరాటం కథాంశం ఆకట్టుకుంది. రైలు ప్రయాణంలో జనరల్ బోగీలో ప్రయాణిస్తూ మృతి చెందిన కొడుకు వివరాలు పొందడానికి ఆచూకీ కోసం చేసిన పోరాటం నాటిక సన్నివేశాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గుంటూరు శ్రీ సద్గురు కళా నిలయం వారి కమనీయం నాటిక చివరి నాటికగా ప్రదర్శించబడింది. కళాకారుడు పడుతున్న ఇబ్బందులు కళాభిమానాన్ని భావితరాలకు పరిచయం చేయాలనే అంశంతో కమనీయం నాటికను ప్రదర్శించారు. అలాగే కల్లూరి సాంబయ్య చేసిన అశ్వర్థామ ఏక పాత్రాభినయం ఆకట్టుకుంది. నాటిక పోటీలను వీక్షించేందుకు పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

సమగ్రాభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి

● మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గుంటూరు కార్పొరేషన్, మే 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 26 జిల్లాల సమగ్రాభి వృద్ధితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమౌతుందని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. శనివారం గుంటూరులో జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో "ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి" పై జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షతన జన చైతన్య వేదిక హాలులో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గత మూడు దశాబ్దాలుగా నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి సత్వరమే పూర్తిచేయాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా 80 వేల కోట్లతో పోలవరం - బనకచర్ల భారీ ప్రాజెక్టును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెరపైకి తీసుకొని వస్తున్నారని, ఇది ఆంధ్రప్రదేశ్ కు



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గుదిబండగా మారనుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమరావతి రాజధాని పేరుతో 58వేల ఎకరాలు సేకరించి, నేడు మరో 44 వేల ఎకరాల సాగు భూములను రైతుల నుండి తీసుకొని ప్రపంచంలోనే 5వ అతి పెద్ద రాజధానిగా నిర్మించాలని పగటి కలలు కంటుందని, దీనికోసం కనీసం రూ.లక్ష కోట్లు అప్పులు చేయడానికి కూడా సిద్ధంగా ఉందని తెలిపారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రగతికి వ్యవసాయరంగ ప్రాధాన్యతే ముఖ్యమని, జల వనరులను సద్వినియోగం చేసుకుని, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తే వ్యవసాయ రంగంలో ఉత్పత్తి పెరిగి, సంపద, ఉపాధి అవకాశాలు మెరుగవుతా యన్నారు.

ప్రముఖ విద్యా వేత్త డీఏఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడు తూ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోగలమని, నియోజక వర్గ, జిల్లాస్థాయిల్లో ప్రణాళిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రజల భాగ స్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలన్నారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎస్ వేణుగోపాలరావు ప్రసంగిస్తూ నది పరీవాహక ప్రాంతాలలో వ్యవసాయేతర కార్యక్రమాలు ఉండరాదని ప్రముఖ వ్యవసాయ శాస్త్ర వేత్త ఎంఎస్ స్వామినాథన్ సూచనను ప్రభుత్వాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ పావులూరి రమేష్, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్ కుమార్, రాజ్యాంగ చర్చావేదిక కన్వీనర్ అవధానుల హరి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

విద్య కోసం విదేశానికి వెళ్లి...

● రోడ్డు ప్రమాదంలో గురజాల వాసి మృతి



నవీన్ (ఫైల్‌ఫోటో)

గురజాలటౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యనభ్యసించేందుకు విదేశానికి వెళ్లిన గురజాల వాసి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గురజాల పట్టణానికి చెందిన నల్ల నవీన్ (26) ఎంబీఏ విద్యనభ్యసించేందుకు 18 నెలల క్రితం సైప్రస్ దేశం వెళ్లారు. అక్కడ విద్యనభ్యసిస్తూనే పార్ట్‌టైం డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. గత శుక్రవారం రాత్రి డెలివరీ ఇచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందారు. దీంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగారు. విషయం తెలుసుకున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మృతుని కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. నవీన్ భౌతికకాయాన్ని స్వస్థలమైన గురజాలకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వంతో మాట్లాడతానని హామీనిచ్చి ధైర్యం చెప్పారు.

పోలీసులపై మాజీ మంత్రి విడదల రజిని ఆగ్రహం

చిలకలూరిపేట, మే10 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట రూరల్ పోలీసులపై మాజీ మంత్రి విడదల రజిని శనివారం మండిపడ్డారు. తన అనుచరుడు శ్రీకాంత్ రెడ్డి అరెస్టుపై ఆమె వైసీపీ సీనియర్ నేతలు పేర్ని నాని, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డైమండ్ బాబు, లేళ్ళ అప్పిరెడ్డిలతో కలిసి పట్టణంలోని తన నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాంత్ రెడ్డి అరెస్టుకు కారణాలు, కేసు వివరాలు ఇవ్వాలని పదేపదే కోరినా పోలీసులు సమాధానం చెప్పలేదని చెప్పారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా వ్యవహరించిన తన పట్ల పోలీసులు చాలా దురుసుగా, అతిగా వ్యవహరించారని ఆమె ఆరోపించారు. ఇప్పటికే తన పైన, తన కుటుంబ సభ్యులపైన అనేక అక్రమ కేసులు బనాయించారని చెప్పారు. తనను చిలకలూరిపేట నియోజకవర్గంలో తిరగనియ్యకుండా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ శ్రేణులను అనేక రకాలుగా పోలీసులు వేధిస్తున్నారని చెప్పారు. సమావేశంలో మాట్లాడిన సీనియర్ వైసీపీ నేతలందరూ తమ పార్టీ వారి పట్ల పోలీసులు అనుసరిస్తున్న వైఖరిని ఖండించారు.

సీజీహెచ్‌ఎస్‌కు రేపు సెలవు

గుంటూరు, మే 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు వైద్య సేవలు అందించే సీజీహెచ్ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్) వెల్ నెస్ సెంటర్ కు సోమవారం బుద్ధ పూర్ణిమ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిందని సీజీహెచ్ఎస్ గుంటూరు ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డీ తుకారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

డబ్బివ్వకుంటే మా భూములు మాకిప్పించండి

- ఈవో వద్దకు వెళ్తే మరోసారి రావద్దంటున్నారు
- మంత్రి మనోహర్ ఆదేశించినా పట్టించుకోవడంలేదు
- వైకుంఠపురం ఆలయ మాడవీధుల భూ బాధితులు

తెనాలి అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి): దేవుడి కోసం తక్కువ ధరకే భూములు ఇచ్చాం.. ఇంతవరకు డబ్బులు ఇవ్వలేదు. ఈవో మారగానే ఒప్పందానికీ విలువ లేకుండా పోయింది. మా భూములు ఇప్పించండని మంత్రి మనోహర్‌ను కూడా కలిశాం. ఆయన ఆదేశాలను కూడా దేవదాయశాఖ అధికారులు ఖాతరు చేయడంలేదు.. అంటూ తెనాలిలోని వైకుంఠపురం వేంకటేశ్వరస్వామి మాడవీధులు భూ బాధితులు శనివారం తెనాలిలో జరిగిన విలేకర్ల సమావేశంలో వాపోయారు. మానేపల్లి రవికుమార్, దండా వెంకట సుబ్రహ్మణ్యం, వడ్డే కనకాంబరంతో పాటు మరో 8 మంది రైతులు విలేకర్లతో మాట్లాడుతూ.. వేంకటేశ్వర స్వామివారి రథం తిరిగేందుకు జాగాలేక పోవడంతో 2023లో ఈవోగా ఉన్న తిమ్మానాయుడు ఆలయం చుట్టూ ఉన్న భూ యజమానులతో ఒప్పందం చేసుకున్నారు. మార్కెట్ రేటు గజం రూ.20వేలు ఉంటే రూ.13 వేలకు ఇచ్చేలా ఒప్పందం చేసుకుని ఆరు నెలల్లో నగదు ఇస్తామని లేకుంటే వడ్డీతో చెల్లిస్తామని అందులో ఈవో పేర్కొన్నారు. ఆ ఈవో బదిలీతో పరిహారం ఆగిపోయింది. దీంతో ప్రస్తుత ఈవోను కలిసి గత ఒప్పందం గురించి చెప్తే ఆలయానికి ఆదాయం సరిగా లేదు.. డబ్బు చెల్లించలేమని చెప్పారు. రెండు, మూడు సార్లు కలిసేందుకు ప్రయత్నిస్తే పదేపదే రావద్దు అప్పటి ఈవోనే కలవండి అంటూ తమపై ఆగ్రహం వ్యక్తం చేశారని రైతులు తెలిపారు. దేవుడి కోసం తాము తక్కువ ధరకు భూములు ఇచ్చేందుకు అంగీకరించామని, కానీ మాకు న్యాయం జరగకపోగా అవమానం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మంత్రి ఆదేశాలతో ఈ నెల 7న తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లినా ఆలయ అధికారులు మాత్రం రాలేదని రైతులు మానేపల్లి రవికుమార్, దండా వెంకట సుబ్రహ్మణ్యం, వడ్డే కనకాంబరం, మరో 8 మంది తెలిపారు. ఈ పరిస్థితుల్లో మరోసారి మంత్రిని కలసి న్యాయం జరిగేలా చూడాలని వేడుకోవాలని నిర్ణయించుకున్నట్లు వారు తెలిపారు.

జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రుల్లో జన ఔషధి దుకాణాలు!

- 15 శాతం మార్జిన్‌తో రోగులకు మందుల విక్రయాలు
- నిర్వహణ బాధ్యత ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి
- అనుమతించిన ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు

గుంటూరు మెడికల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో జిల్లా హెడ్ క్వార్టర్ హాస్పిటల్స్‌తో పాటు ప్రాంతీయ వైద్యశాలల్లో కొత్తగా జన ఔషధి మందుల దుకాణాలు రోగులకు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆసుపత్రుల కొచ్చే రోగులకు వీటివల్ల తక్కువ ధరలకే నాణ్యమైన జనరిక్ మందులు లభిస్తాయి. ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియో జన పథకం కింద ఈ దుకాణాలను ఏర్పాటు చేస్తారు. దుకాణాల నిర్వ హణ బాధ్యతలను లాభాపేక్షలేని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి అప్ప గించాలని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తీర్మానించారు. ఇండి యన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లాస్థాయి బ్రాంచ్‌లకు కలెక్టర్లు చైర్మన్లుగా ఉంటారు. ప్రస్తుతం గుంటూరు ప్రభుత్వ సమగ్రా స్పత్రిలో ప్రస్తుతం రెండు జనరిక్ మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. స్వయం సహా యక బృందాలు, జిల్లా మహిళా సమాఖ్య ద్వారా కొన్ని చోట్ల ఈ దుకా ణాలు నడుస్తున్నా ప్రైవేటు వ్యక్తులు వీటి అజమాయిషీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రెడ్‌క్రాస్ సొసైటీకి మందుల దుకాణాల బాధ్యతలు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది.

లోపాలను సరిదిద్ది..

జనరిక్ మందుల తయారీ, వాటి ధరలను నిర్ణయించడంలోని లోపాల్ని ఉపయోగించుకుని ప్రస్తుతం అమ్మకందారులు రోగులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అధిక ధరలకు మందుల ఎంఆర్‌పీలు ముద్రించి, వీటిపై 50 నుండి 600 శాతం మేరకు లాభాలను ఆర్జిస్తున్నారు. అధిక లాభార్జనను నిరోధించడంతో పాటు ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల అమ్మకాలను నిరోధించే తప్పనిసరి బిల్లింగ్ వ్యవస్థ అమలులో లేదు. ఇది రిటైల్ వ్యాపారులకు అనుకూలంగా మారింది. వారు తమ ఇష్టానుసారం డిస్కౌంట్లను అందిస్తున్నారు. అవసరమైన జనరిక్ ఔషధాలలో 30 శాతం నుంచి 40 శాతం వరకు మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యేక నియంత్రణ చర్యలు చేపట్టింది. జెనెరిక్ మందులపై 15 శాతం మార్జిన్‌తో మాత్రమే జన ఔషధి కేంద్రాలు విక్రయిం చా లి. ఇది రోగులకు భారీగా ప్రయోజనం చేకూరుస్తుంది. ప్రతి అమ్మ కా న్ని కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలి. తద్వారా రిటైలర్లు జనరిక్ ఔషధాల అమ్మకపు ధరలను మార్చటానికి వీలుండదు. అరుదైన సందర్భాలలో తప్ప జన ఔషధి దుకాణదారులు ఖరీదైన బ్రాండెడ్ మందులను విక్రయించకూడదు. సంబంధిత అధికారుల ఆమోదంతో కొన్ని వ్యాధులకు జనరిక్ మందులు అందుబాటులో లేనప్పుడు మాత్రమే బ్రాండెడ్ మందులను విక్రయించాలని స్పష్టం చేశారు.

తెనాలిలో రౌడీయిజాన్ని రూపుమాపుతాం..!

◆ రౌడీషీటర్ల ఇంటికి నేరుగా వెళ్లిన ఎస్పీ ◆ నేరప్రవృత్తిని కొనసాగిస్తే నగర బహిష్కరణ ◆ ఎస్పీ సతీష్‌కుమార్



రౌడీషీటర్‌తో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

తెనాలిరూరల్,మే10 (ఆంధ్రజ్యోతి): గతంలో తెనాలిలో పెట్రేగిన రౌడీ యిజాన్ని పూర్తిస్థాయిలో రూపుమాపుతామని గుండా గిరికి పాల్పడాలంటే నేరస్తులకు వణుకుపుట్టేలా ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు. శనివారం తెనాలి విచ్చేసిన ఎస్పీ నేరుగా రౌడీషీటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబసభ్యుల యో గక్షేమాలతో పాటు జీవన విధానం, సత్ప్రవర్తనతో మెలుగుతున్నారా..లేదా వంటి పలు విషయాలపై ఆరా తీశారు. నేర ప్రవృతిని విడనాడి ప్రశాంత జీవితం గడపాలని, రాత్రి 8గంటల లోపు ఇళ్లకు వచ్చి బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. నిరం తరం పోలీసుల నిఘా ఉంటుందని ఏమాత్రం చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అనుమానం వచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎస్పీ సతీష్ కుమార్ మీడియాతో మాట్లాడారు. తెనాలి ప్రాంతంలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. ఇటీవల నేరాలకు పాల్పడిన ప్రాంతాలను, రౌడీషీటర్ల స్థితిగతులను తెలుసుకోవడం జరిగిందన్నారు. గతంతో పోల్చుకుంటే తెనాలిలో క్రైం రేటు తగ్గుముఖం పట్టిందన్నారు. అందుకు ప్రధానంగా రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంచడంతో పాటు వారికి ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. నేర ప్రవృత్తి మానకుంటే జరిగే పరిణామాలను వారికి వివరిస్తూ వారిలో మార్పు కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. రౌడీషీటర్లపై ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. నేర ప్రవృత్తిలో మార్పురాని పలువురు రౌడీషీటర్లపై ఇప్పటికే పీడీ యాక్టు పెట్టడం జరిగిందన్నారు. మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు రౌడీషీటర్ల ప్రవర్తనను బట్టి వారిపై రూ. ఐదు లక్షలకు బైండవర్ చేయడం జరుగుతుందని, కట్టలేని పక్షంలో జైలుకు వెళ్లాల్సి ఉంటుందని.. ఇప్పటికే ఒక రౌడీషీటర్‌కు జైలుశిక్ష పడిందన్నారు. రాబోయే రోజుల్లో రౌడీషీటర్లపై నగర బహిష్కరణ కూడా అమలు చేయబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జనార్థన్‌రావు, ఎస్ఐలు, సీఐలు ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీని పట్టుకున్న పోలీసులు

గురజాలటౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైల్‌లో ఉన్న రిమాండ్ ఖైదీ షేక్ జిలానీని వాయిదా నిమిత్తం శుక్రవారం దాచేపల్లి పోలీసులు సబ్‌జైల్ నుంచి కోర్టుకు తీసుకెళ్లారు. కోర్టు ప్రాంగణంలో కళ్లుగప్పి జిలానీ మధ్యాహ్న సమయంలో తప్పించుకున్నాడు. జిలానీ ఫోన్ వినియోగిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు ఆ ఫోన్ నంబరు ద్వారా దాచేపల్లి సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అర్థరాత్రి 2 గంటల సమయంలో ఖైదీని సబ్‌జైల్‌కు తీసుకొచ్చినట్లు సబ్‌జైల్ సూపరింటెండెంట్ అచ్చినాయుడు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	133, 142, 153
చికెన్ విత్ స్కిన్(కిలో)	254.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	264.00

సత్తెనపల్లిలో గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

గుంటూరు సిటీ, మే 10(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లిలోని స్పైసెస్ ఆఫ్ పల్నాడు హోటల్ నందు విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆ హోటల్ నందు వంట కొరకు సబ్సిడీ డొమెస్టిక్ సిలిండర్‌లు వాడుతున్నట్లు గుర్తించి, సిలిండర్‌లను సీజ్ చేసి యజమాని రామలింగారెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐ పల్లపు శివాజీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు..

రాయితీతో పశువుల దాణా పంపిణీ

రాజుపాలెం, మే 10(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం ప్రాథమిక పశు వైద్యశాలలో పాడి రైతులకు 50శాతం రాయితీతో దాణా కట్టలను టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు పంపిణీ చేశారు. ఏడీఏ వీరయ్య మాట్లాడుతూ పాడి రైతులకు పశు సంవర్ధక శాఖ 50శాతం సబ్సిడీపై పశుపోషకులకు 20శాతం మాంసకృతులు కల్గిన పశువుల దాణాను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. వేసవి కాలంలో ఈ దాణాను వాడటం వలన పాల ఉత్పత్తి, వెన్నశాతం తగ్గకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పులిబండ్ల సాంబశివరావు, సఖినాల వలరాజు, జెట్టి కోటేశ్వరరావు, వాసా వెంకటేశ్వర్లు, పెద్దింటి శ్రీను, లంకా వీరయ్య, దుడుకు రామారావు, వెంకట్రామయ్య, జమ్ముల తిలక్ తదితరులు ఉన్నారు.

సైప్రస్‌లో నవీన్ మృతిపై ఎమ్మెల్యే యరపతినేని విచారం

పిడుగురాళ్ల, మే 10(ఆంధ్రజ్యోతి): గురజాలకు చెందిన నల్లా నవీన్ సైప్రస్ దేశంలో ఉన్నత విద్య కోసం వెళ్లాడు. ఈ క్రమంలో సైప్రస్ దేశంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నవీన్ కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఫోన్‌లో మాట్లాడి విచారం వ్యక్తం చేశారు. విదేశాంగ ప్రతినిధులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు విషయాన్ని ఎమ్మెల్యే తెలియజేసి త్వరితగతిన మృతదేహాన్ని గురజాలకు రప్పించేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీ శ్రేణులు తెలిపాయి.

మట్టపల్లి దేవస్థానంలో ధ్వజారోహణం

దాచేపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రజల ఆరాధ్య దైవం మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం ప్రతి ఏటా వైశాఖ పౌర్ణానికి నిర్వహించటం ఆచారం. ఇందులో భాగంగా శనివారం ధ్వజారోహణాన్ని చేపట్టారు. మూలమూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి లక్షమల్లెలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్కంఠ వీరభద్రస్వామి దేవాలయంలో చండీహోమం, కుంభాభిషేకం

నకరికల్లు, మే 10(ఆంధ్రజ్యోతి): కుంకలగుంటలోని భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్రస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రయాహ్నిక దీక్షతో చండీ హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. స్వామివార్లను విశేషంగా అలంకరించి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కుంకలగుంటలో ఉన్న కార్యసిద్ధి వినాయకస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

సత్తెనపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ మండలం మాదల డొంక రోడ్డు నుంచి వెన్నాదేవి గ్రామానికి వెళ్ళే మార్గంలో ఉన్న వాగు మీద బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ మాదల మాజీ సర్పంచ్ రావిపాటి భాస్కరరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రావిపాటి మధుబాబు, మాదల గ్రామానికి చెందిన 30మంది రైతులు శనివారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలసి వినతి పత్రం అందించారు, ఈ రెండు గ్రామాల పరిధిలో రైతుల భూములు ఉన్నాయని, వర్షాకాలంలో, ఇతర సమయాల్లో పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకోవాలన్నా ఇబ్బంది పడుతున్నామని వారు కన్నాకు వివరించారు.

ముమ్మరంగా కమిటీల ఏర్పాటు

సత్తెనపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాష్ నారాయణ, టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో పలు వార్డుల కమిటీలను నియమించారు. కార్యక్రమంలో నూర్‌బాషా జాన్‌బాబు, టీడీపీ నేతలు సయ్యద్ పెదకరిముల్లా, మస్తాన్‌వలి, ఆతుకూరి నాగేశ్వరరావు, ఇతర టీడీపీ నేతలు ఉన్నారు.

సైనిక నిధికి విరాళం

సత్తెనపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్లు గుజ్జర్లపూడి సతీష్‌కుమార్ తన నెల వేతనం రూ.2500 సైనిక నిధికి విరాళాన్ని ప్రకటిస్తున్నట్లు శనివారం తెలిపారు. పట్టణంలోని ప్రజాప్రతినిధులు, వ్యాపార వేత్తలు, ప్రజలు స్వచ్ఛందంగా ఇండియన్ ఆర్మీకి విరాళాలు అందించి దేశభక్తి చాటుకోవాలన్నారు.

12న జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు

అచ్చంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు జరగనున్నట్లు జిల్లా కార్యదర్శి గుడిపూడి భూషణం శనివారం తెలిపారు. అండర్-17 విభాగంలో బాల బాలికల విభాగం ఎంపికలు జరుగుతాయని, పాల్గొనేవారు 2008, 2009, 2010 సంవత్సరాల్లో పుట్టినవారు అర్హులన్నారు. అండర్ - 23 విభాగంలో 2002, 2003, 2004, 2005, 2006 సంవత్సరాల్లో పుట్టినవారు అయి ఉండాలని, 2006లో పుట్టిన వారు మెడికల్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనేవారు ఈ నెల 12న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే రెజ్లింగ్ పోటీలకు ఆధార్‌కార్డు జిరాక్స్, ఒరిజనల్, మెడికల్ సర్టిఫికెట్లు తీసుకొని రావాలన్నారు. ఎంపికైనవారు ఈనెల 16, 17, 18 తేదీల్లో చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 10(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 513.40 అడుగులు ఉంది. ఇది 137.51 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల..

అచ్చంపేట, మే 10(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 22.75 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

ఎండ్రాయిలో నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎండ్రాయి గ్రామంలో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

నేడు వేణుగోపాలస్వామి కల్యాణమహోత్సవం

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లపూడి గ్రామంలో శ్రీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వార్ల వార్షిక కల్యాణమహోత్సవం ఆదివారం సాయంత్రం 7గంటలకు జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. రాత్రి స్వామివారి దివ్యరథోత్సవం జరుగుతుందని తెలిపారు. భక్తులకు అన్నదానం జరుగుతుంది..

యథేచ్ఛగా ఆక్రమణలు

● పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

ముటుకూరు రోడ్డులో ఆర్అండ్‌బి స్థలంలో సాగవుతున్న భూమి





రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణకు గురైన వినుకొండ రోడ్డు

దుర్గి, మే 10(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, పోరంబోకు, చెరువులు, ఆర్అండ్‌బీ స్థలం ఇలా అనేకం ఆక్రమణలకు గురయ్యాయి. మాచర్ల-నరసరావుపేట, దుర్గి-వినుకొండ, దుర్గి-ముటుకూరు ఆర్అండ్‌బీ రహదారులు ఇరువైపులా 90 శాతానికి పైగా ఆక్రమణకు గురయ్యాయి. తారురోడ్డు వరకు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో వర్షపు నీరు వృథాగా పోకుండా భూగర్భ జలాలు వృద్ధి చెందాలనే ఉద్దేశంతో వాగులలో చెక్ డ్యాం నిర్మించారు. ఆక్రమణదారులు అవి కూడా పక్కన పెట్టి వాగులు కూడా ఆక్రమించి పంటల సాగు చేయడంతో వర్షపునీరు వృథా అవుతోంది. ఆర్అండ్‌బీ రోడ్డు ఇరువైపులా ఉన్న భూమి దురాక్రమణకు గురవడంతో పశువుల మేతకు సంకటంగా మారింది. పశుపోషకులు తమ పశువులను మేపుకోవడానికి జానెడు జాగా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ రహదారులు ఇరువైపులా పచ్చిక బయళ్లతో నిండి ఉండేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వ రెవెన్యూ భూముల్లో కొన్ని పేదలకు పంపిణీ కాగా, బోడులు, బీళ్లు ఆక్రమణలోకి వెళ్లి పంట భూములుగా మారాయి. ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఉన్న స్థలాలను పక్కనే ఉన్న రైతులు తమ పొలాల్లో కలుపుకున్నారు.

స్పందించని ఆర్అండ్‌బీ అధికారులు

ఆర్అండ్‌బీ రహదారులన్నీ ఆక్రమణకు గురవుతున్నప్పటికీ ఆ శాఖ అధికారుల్లో స్పందన కరువైంది. ఆక్రమణదారులు తారురోడ్డుకు పదడుగుల దగ్గర వరకు చొచ్చుకొస్తున్నప్పటికీ ప్రేక్షకపాత్ర వహిస్తున్నారే తప్ప చర్యలకు ఉపక్రమించడం లేదు. ఆక్రమిత ఆర్అండ్‌బీ స్థలంలో సాగు చేస్తున్నప్పటికీ అధికారులు నిద్రావస్థలో ఉన్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు ఆక్రమిత స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



దుర్గిలోని బండ్ల వాగులో సాగు చేస్తున్న దృశ్యం

మురళీ నాయక్‌కు నివాళులు



మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు

సత్తెనపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): సైన్యంలో విధులు నిర్వహిస్తూ దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీ నాయక్ చిత్రపటానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తన కార్యాలయంలో టీడీపీ నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తాతా జయప్రకాష్‌నారాయణ, నాగోతు శౌరయ్య, ఎలినేడి రామస్వామి, నూర్‌బాషా జానీబాబు, మక్కపాటి రామచంద్రరావు, పల్లపాటి పెద్దిరాజు, కోమటినేని శ్రీనివాసరావు, రావిపాటి మధుబాబు, వక్కంటి అజయ్, పూజల వెంకటకోటయ్య, అతుకూరి నాగేశ్వరరావు, గుంటూరు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే కన్నా

రాజుపాలెం, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అకులగణపవరం గ్రామంలో శ్రీభద్రకాళి సమేత వీరభద్ర శ్రీపార్వతి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శ్రీపోలేరమ్మ పోతురాజుస్వామి వార్ల నూతన దేవాలయ విగ్రహప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలుచేశారు. కార్యక్రమంలో గ్రామ, మండలస్థాయి నాయకులు ఉన్నారు.



ఆకులగణపవరంలో ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ఏసుక్రీస్తు జూబ్లీలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హోలీ ఫ్యామిలీ పాఠశాల క్రీడామైదానంలో శనివారం నుంచి ప్రారంభమైన ఏసుక్రీస్తు జూబ్లీ వేడుకల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. గుంటూరు బిషప్ భాగ్యయ్య కన్నాకు దీవెనలు అందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మదార్‌సాహెబ్‌కు మధుబాబు శుభాకాంక్షలు

మాచర్లటౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): మాచర్ల మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన షేక్ మదార్‌సాహెబ్‌కు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో మదార్‌సాహెబ్‌ను కలిసి దుశ్శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నేతలు షేక్ కరిముల్లా, బొలినేని లచ్చయ్యచౌదరి, షేక్ మోసిన్, ముస్లిం, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.



మదార్‌సాహెబ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న చిరుమామిళ్ల మధుబాబు

మంత్రి అచ్చెన్నాయుడికి చింతపల్లి రైతుల వినతి

కారంపూడి, మే 10 (ఆంధ్రజ్యోతి): మంత్రి అచ్చెన్నాయుడుని మండలంలోని చింతపల్లి గ్రామస్తులు శనివారం గుంటూరులో కలిశారు. ఈ సందర్భంగా వారు తమ ఆవేదనను మంత్రికి వివరించారు. వరి, కందులను రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేయాలని కోరారు. కారంపూడి మండలంలో వరి, కంది పంటలను ఎక్కువగా సాగు చేశామని, సరైన మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ యేడాది పంటలు సమృద్ధిగానే పండాయని, దిగుబడి బాగా వచ్చినా సరైన ధర లేక నష్టపోతున్నామని మంత్రి దృష్టికి తెచ్చారు. దళారులు సగం ధరకు కొనుగోలు చేస్తున్నారని వాపోయారు. వచ్చే ఏడాది నుంచి అయినా రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని వినతిపత్రం అందించారు.

కనులపండువగా వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమ్మ కల్యాణం

రెంటచింతల, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పశర్లపాడు గ్రామంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ కల్యాణం శనివారం కనులపండువగా నిర్వహించారు. బ్రహ్మంగారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మొక్కుల తీర్చుకున్నారు. ఆధ్యాత్మిక సంబరాల్లో భాగంగా రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటుచేసి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

12న రంగనాథస్వామికి...

మాచర్లటౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుపులో కృష్ణానది తీరాన కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కల్యాణ మహోత్సవం ఈనెల 12వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు పురావస్తుశాఖ అధికారులు, ఆలయ కమిటీ ఆధ్వర్యాన అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు.

ఆర్మీ జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి

మాచర్లటౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన ఆర్మీ జవాన్ మురళీనాయక్‌కు గిరిజన నేతలు ఘనంగా నివాళులర్పించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలానికి చెందిన మురళీనాయక్ దేశ సరిహద్దులో పాకిస్థాన్ సైన్యం జరిపిన కాల్పులకు మరణించారు. ఈ మేరకు శనివారం గిరిజనులు మాచర్ల పట్టణంలో భారీ ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో వజ్రంనాయక్, గుండ్లా నాయక్, వెంకటేశ్వర్లు నాయక్, గాంధీనాయక్, సుధాకర్ నాయక్, భవాని శంకర్‌నాయక్, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

సత్తెనపల్లి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందటమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని నందిగామలో ఉచిత కుట్టు మిషన్ ట్రైనింగ్ సెంటర్‌ను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి మహిళల స్వయం ఉపాధికి ఈ శిక్షణా కేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, టీడీపీ నాయకులు ఆళ్ళ సాంబయ్య, బలిజేపల్లి విజయకుమార్, సాధినేని సాంబశివరావు, తుమ్మల ఏడుకొండలు, కట్టా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సత్తెనపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రూ 1.30కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు. మరికొన్నింటిని ప్రారంభించారు. 9వ వార్డులో గుంటూరు రోడ్డు నుంచి జడ్జి బంగ్లా వరకు రూ.37లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. అన్న క్యాంటీన్ నుంచి జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు రూ.19.70లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు ప్లాట్‌ఫాంకు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మీ సేవా సెంటర్ వరకు రూ.29 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు తారకరామసాగర్ వాకింగ్ ట్రాక్‌లో రూ.16.40 లక్షలతో చేయనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 26వ వార్డులో శివాలయం వెనుక రూ.11.20 లక్షలతో సీసీ డ్రెయిన్‌లు, 19వ వార్డులో రూ.17.50లక్షలతో నిర్మించనున్న కల్వర్టు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆయనతో పాటు టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, నూర్ బాషా జానీబాబు, బలిజేపల్లి సురేష్‌కుమార్, మారెళ్ళ మల్లేశ్వరరావు, స్వామి, మామిడి ప్రకాష్, సయ్యద్ పెదకరిముల్లా, రంగిశెట్టి సుమన్, మస్తాన్‌వలి, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని ▶ బీజేపీ నేతల పూజలు

మాచర్ల రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని శనివారం బీజేపీ నేతలు బస్టాండ్ సెంటర్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో విజయసంకల్ప పూజలు నిర్వహించారు. ప్రధాని మోదీ, త్రివిధ దళాలు, భారతసైన్యానికి మనోధైర్యం అందించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కూనిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు బొగ్గవరపు మస్తాన్‌రావు, నియోజకవర్గ కోకన్వీనర్ పోకూరి కాశీపతి, ఆలేటి సామేలు, యేచూరి సురేష్‌బాబు, పట్టణ ఉపాధ్యక్షుడు మారం వంశీకృష్ణ, బొడ్డుపల్లి ఈశ్వరయ్య, పట్టణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

భారత సైన్యానికి అఖండ బలం కలగాలి

రెంటచింతల, మే 10(ఆంధ్రజ్యోతి): భారత్-పాక్ యుద్ధంలో భారత్ అఖండ విజయం సాధించాలని, జవాన్లంతా క్షేమంగా వుండాలని బీజేపీ నేతలు వేడుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బి.నాగిరెడ్డి నేతృత్వంలో సుబ్బన్నతోటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఎం.సురేష్‌బాబు, కొత్త రాజేశ్వరరావు, జనసేన నాయకులు వెంకటేష్, రాము, కిరణ్‌కుమార్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు అధికారుల చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మాచర్ల రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో మాచర్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై మాచర్లలో ట్రాఫిక్ టెర్రర్ శీర్షికన కథనం ప్రచురితమవడంతో పోలీసు అధికారులు స్పందించారు. పట్టణంలో రోడ్డు మార్జిన్‌లలో వాహనాలు నిలిపిన వాహనదారులకు, దుకాణాదారులకు పట్టణ ఎస్ఐ తురకా వెంకటరమణ పలు సూచనలు చేశారు. దుకాణాల ముందు వాహనాలు పార్కింగ్ చేయకుండా చూసుకోవాలన్నారు. అలాగే ఆటోవాలాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇష్టానుసారంగా ఆటోలను నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. అధిక లోడుతో ఆటోలు నడిపినా, సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా నడిపినా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఆ ఊరే ఒక సైన్యం!



కార్గిల్‌యుద్ధం సమయంలో ఉన్నతాధికారులతో బాపూజీపాలెంకు చెందిన సైనికులు

ఆ ఊరే ఒక సైన్యం. దేశ సంరక్షణకు ఆ గ్రామస్తులు వెనుకాడరు. తరతరాల నుంచి ఇంటికి ఇద్దరు నుంచి ఐదుగురు సైన్యంలో సేవలిందిస్తున్నారు. దేశ సంరక్షణలో వారు అసువులు బాస్తున్నా.. భారతావనికి తల్లిదండ్రులు తమ బిడ్డలను దత్తత ఇస్తూనే ఉన్నారు. ఇంతటి సేవలందిస్తున్న ఆ గ్రామాన్ని ఆర్మీ గుర్తించి..దత్తత తీసుకుంది. పహల్గాం దాడిని ముక్త కంఠంతో ఖండిస్తూ..ఉగ్ర పీచమణచే సత్తా భారత్‌కు ఉందని బాపూజీపాలెం మాజీ సైనికులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దేశ సంరక్షణకు ఇంకా ఎంతమంది సైనికులనైనా అందిస్తామని చెబుతున్నారు.

- భారతావనికి..సైనికులను దత్తత ఇస్తున్న బాపూజీపాలెం
- తరాల నుంచి సైన్యంలో విధులు
- ఇంటికి ఇద్దరి నుంచి ఐదుగురి వరకు సేవలు
- గ్రామానికి ప్రత్యేక గుర్తింపు.
- దత్తత తీసుకున్న ఆర్మీ
- పహల్గాం దాడి హేయం.. ఉగ్ర పీచమణచాలి
- ఆ సత్తా భారత్‌కు ఉంది: మాజీ సైనికులు

రేపల్లె, మే10 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో 26 మంది పర్యాటకులను పొట్టనబెట్టుకున్న పాకిస్తాన్ ఉగ్ర వాదులను మట్టుపెట్టేందుకు వీరోచితంగా పోరాడు తున్న భారత సైన్యంలో బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం, బాపూజీపాలేనికి చెందిన సైనికులు అధిక సంఖ్యలో ఉన్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. 550 కుటుంబాలున్న ఈ గ్రామ జనాభా 2,400 మంది. గ్రామానికి చెందిన 200 మంది సైనికులు దేశ సరిహద్దుల్లో భారతవని రక్షణ కోసం పహారా కాస్తున్నారు. దేశ రక్షణ కోసం పోరాడుతూ అనేక మంది ప్రాణాలు కోల్పోయినప్పటికీ.. తమ పిల్లలను సైన్యంలోకి పంపేందుకు తల్లిదండ్రులు ఏమాత్రం ఆలోచించడం లేదు. గతంలో ఆర్మీ తమ దత్తత గ్రామంగా బాపూజీపాలేన్ని ప్రకటించింది. జమ్ముకశ్మీర్‌లో తమ గ్రామానికి చెందిన సైనికులు ఎక్కువ మంది ఉన్నారని గ్రామస్తులు గర్వంగా చెప్పుకుంటున్నారు. పహల్గాం ఘటన హేయమైన చర్య అని, ఉగ్రవాదులను అంతమొందించడంలో భారత్ వెనుకాడబోదంటూ ధైర్యం ప్రదర్శిస్తున్నారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను భారత్ అణచివేస్తుందన్న.. పూర్తి విశ్వాసాన్ని మాజీ సైనికులు చూపుతున్నారు.

గ్రామాన్ని దత్తత తీసుకున్న ఆర్మీ

బాపూజీపాలెంలో అత్యధికంగా సైనికులు ఉన్నారని గుర్తించి.. ఆర్మీ మద్రాస్ స్పాన్సర్ ఉన్నతాధికారులు 1980లో గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఇక్కడ మంచి నీటి పథకం నిర్మించారు. అప్పట్లోనే విద్యుత్ వసతి కల్పించడంతో పాటు.. జవాన్ల కోసం ప్రత్యేక బ్యాంకును ఏర్పాటు చేశారు. బాపూజీపాలేనికి మిలటరీ ఉన్నతాధికారుల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి నుంచి ఎవరైనా ఆర్మీలో చేరేందుకు వెళితే.. వెంటనే వారికి అనుమతులు మంజూరు చేస్తారు.

దేశ సంరక్షణలో సైన్యం పటిష్టం



దేశ రక్షణలో భారత సైన్యం పటిష్టంగా ఉందని, ఎంతటి విపత్కర పరిస్థితుల్లోనైనా.. ముందుండి పోరాడేశక్తి ఆర్మీకే ఉంటుందంటున్నారు మాజీ సైనికుడు షేక్ దాదాబేర్. 1971లో పాకిస్తాన్, ఇండియా యుద్ధంలో బాపూజీపాలెం నుంచి 20 మంది సైనికులు పైనే పాల్గొన్నారని ఆయన చెప్పుకొచ్చారు. ప్రస్తుతం వారిలో పదిమంది వరకు గ్రామంలో ఉన్నారని చెప్పారు. సహచరులు షేక్ సుభాని, ఎండీ అబ్దుల్లా, ఎండీ గౌస్, అబ్దుల్ రషీద్, ఎండీ మస్తాన్ వలీలు పాకిస్తాన్ యుద్ధంలో పాల్గొన్నారని వివరించారు. మొదటి నుంచి పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతూ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తుందని మండిపడ్డారు. ఉగ్రవాదులను మట్టి కరిపించేందుకు భారత్ వెనుకాడబోదన్నారు.

ఇండియా,పాకిస్తాన్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికుడు షేక్‌దాదాబేర్



సైనిక ఉన్నతాధికారులతో బాపూజీపాలెంకు చెందిన సైనికుల గ్రూప్ ఫొటో

ఐదు తరాల నుంచి మిలటరీలోనే విధులు



ఐదు తరాల నుంచి తమ కుటుంబం దేశరక్షణలో ఉందని బాపూజీపాలేనికి చెందిన మహ్మద్ ఇబ్రహీం తెలిపారు. 1971లో ఇండియా - పాకిస్తాన్ యుద్ధంలోనూ పాల్గొన్నట్లు చెప్పారు. దేశ ప్రజలపై.. అమానుషంగా పాక్ ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని ఖండించారు. వారిని అంతమొందించేందుకు భారత్ వెనుకాడబోదని స్పష్టం చేశారు. అప్పట్లో ఇంత టెక్నాలజీ లేదని, యుద్ధం వస్తే ఎంత దూరమైన మంచుకొండల్లోనైన నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చేదని గుర్తుచేసుకున్నారు. బోర్డర్ సమీపంలోనే ఆయుధాలు దాచుకుని, యుద్ధం చేయాల్సి వచ్చేదని చెప్పారు. భారతదేశం ఎంతో అభివృద్ధి చెందిందని, దేశం వైపు చూసే పరిస్థితి ప్రస్తుతం ఏ దేశానికి లేదని ధీమా వ్యక్తం చేశారు. తనకు ఇద్దరు కుమారులు మహ్మద్ నజీర్ అహ్మద్, మహ్మద్ గాలం కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నట్లు చెప్పారు.

ఇండియా - పాకిస్తాన్ యుద్ధంలో పాల్గొన్న మహ్మద్ ఇబ్రహీం

నాలుగు తరాల నుంచి..



తమ కుటుంబం నాలుగు తరాల నుంచి దేశరక్షణ కోసం పనిచేస్తోందని గ్రామానికి చెందిన మాజీ సైనికుడు షేక్ మస్తాన్‌వలీ తెలిపారు. 1965లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టి.. 1987లో ఉద్యోగ విరమణ చేశానని చెప్పారు. జమ్ముకాశ్మీర్, మిజోరాం, అబీఘర్, శ్రీగంగా నగర్‌లో పంజాబ్‌లో విధులు నిర్వహించినట్లు తెలిపారు. తమ తాత మహ్మద్ అనీఫ్ జవానుగా యుద్ధంలో మృతి చెందారని గుర్తుచేశారు. తన తండ్రి అహ్మద్ ఇబ్రహీం మిలటరీలో 30 ఏళ్ల పాటు సేవలు అందించారని తెలిపారు. తనకు ముగ్గురుకుమారులని.. అందరూ ఆర్మీలోనే పనిచేస్తున్నారని, ఇద్దరు అమ్మాయిలనూ ఆర్మీలో పనిచేసేవారికి ఇచ్చి వివాహం చేశానని గర్వంగా చెప్పారు. దేశరక్షణ కోసం తమ గ్రామం పాటుపడుతుందని, ఇంటికి నలుగురు చొప్పున సైన్యంలో చేరి విధులు నిర్వహించడంతో.. దేశవ్యాప్తంగా గ్రామానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.

మాజీ సైనికుడు కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న షేక్ మస్తాన్‌వలీ

డిజిటల్ జనసేవా కేంద్రంగా ఇండియా పోస్టు

● కేరళ పర్యటనలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, మే 10(ఆంధ్రజ్యోతి): ఇండియా పోస్టును డిజిటల్ జనసేవా కేంద్రంగా మరుస్తున్నామని, ఇండియా పోస్టు జాతీయ లాజిస్టిక్ భాగస్వామిగా మారుతుందని కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కేరళలోని తిరువనంతపురం జిల్లాలో శనివారం ఆయన పర్యటించారు. పర్యటనలో భాగంగా ప్రముఖ వైష్ణవ ప్రాచీన పుణ్యక్షేత్రమైన తిరువనంతపురంలోని అనంతపద్మనాభ స్వామిని, శివగిరి మఠాన్ని ఆయన దర్శించుకున్నారు. అనంతరం వరకలలో నూతన కార్యాలయాన్ని అటింగల్ పార్లమెంటు సభ్యుడు అడోర్ ప్రకాశ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద శాతం అక్షరాస్యత కలిగిన కేరళకు రావడం తనకెంతో సంతోషం కలిగించిందన్నారు. తపాలా శాఖను సమగ్ర అభివృద్ధికి వేదికగా, ముఖ్య పౌర సేవలు, డిజిటల్, ఆర్థిక సాధికారతకు కేంద్రంగా చేస్తున్నామని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా తపాలా వ్యవస్థ తగ్గుముఖం పడుతున్నా ఈ డిజిటల్ యుగంలో భారత్‌పోస్టు ఒక కొత్త మార్గాన్ని ఎంచుకుందని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద నెట్‌వర్క్ ఉన్న భారత తపాలా శాఖ ఇప్పటిదాకా 1.6 లక్షలకు పైగా పోస్టాఫీసులను కలిగి ఉందన్నారు. ప్రధానమంత్రి మోదీ దూరదృష్టితో డిజిటల్ జనసేవా కేంద్రంగా మార్పు జరిగిందన్నారు. 420కి పైగా పోస్టాఫీసుల్లో పాస్‌పోర్టు సేవలను అందిస్తున్నామని, ఆధార్, మొబైల్ బ్యాంకింగ్ క్యూఆర్ కోడ్ లావాదేవీలతో ప్రతి పౌరుడిని డిజిటల్ ఇండియాలో భాగస్వాములను చేస్తున్నామన్నారు. పర్యటనలో భాగంగా ప్రముఖ సామాజిక, ఆధ్యాత్మికవేత్త నారాయణగురుకు చెందిన శివగిరి మఠాన్ని ఆయన సందర్శించారు.



పోస్టాఫీస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

తేజం పలచబడుతోంది

- కొనుగోళ్లకు ఆయిల్ కంపెనీలు వెనకడుగు
- గుంటూరు మిర్చియార్డు నుంచి 60 శాతం విక్రయం ఈ రకానిదే
- శాస్త్రవేత్తలు తక్షణం దృష్టి పెట్టకపోతే ఎగుమతులు పడిపోయే అవకాశం

గుంటూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మిర్చి రకాల్లో రారాజుగా పరిగణించే తేజ వెరైటీ ఈ సంవత్సరం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నది. చీడపీడలు సోకుతుండటంతో గతంలో మందంగా ఉండే కాయ ఇప్పుడు చాలా పలచగా కాపు కాస్తున్నది. దీంతో మిరపకాయ నుంచి రావాల్సినంత మోతాదులో ఆయిల్ తీయలేకపోతున్నారు. ఈ ఏడాది తేజ వెరైటీ మిర్చి ధర పెరగకపోవడానికి దారి తీసిన కారణాల్లో ఇది ప్రధానమైనదని మార్కెటింగ్ వర్గాలు ఒక అంచనాకు వచ్చాయి. ఈ విషయాన్ని ఉద్యానశాఖ, ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నాయి. కనీసం వచ్చే సీజన్‌కు అయినా మేలిమిరకం విత్తనాలు రైతులకు అందేలా చూడాలని కోరనున్నాయి. గుంటూరు, పల్నాడు, కర్నూలు తదితర జిల్లాల్లో తేజ వెరైటీ మిర్చిని అధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తుంటారు. చాలా ఘాటుగా ఉండటంతో విదేశాల్లో ప్రజలు ఎక్కువగా మక్కువ చూపుతుంటారు. అలానే మందుల తయారీలో వినియోగించే ఆయిల్స్‌ను తేజ వెరైటీ మిర్చిని ప్రాసెసింగ్ చేసి తీస్తారు. దేశ వ్యాప్తంగా ఉన్న నాలుగు కంపెనీలు తేజ వెరైటీ నుంచి తీసిన ఆయిల్‌ని విదేశాలకు ఎగుమతి చేస్తుంటాయి. దీంతో ఈ రకం కోసం ఆయా కంపెనీలు ఇక్కడి ఎక్స్‌పోర్టర్లకు ఆర్డర్లు పెడుతుంటాయి. యార్డు నుంచి ఏటా కోటికి పైగా మిర్చి టిక్కీలు వివిధ దేశాలు/రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుండగా దాదాపుగా 60 శాతం తేజ రకం ఆక్రమిస్తుంది. కాగా ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి తేజ వెరైటీ మిర్చి ధర పెరగకుండా స్థిరంగా కొనసాగింది. నాణ్యతని బట్టి క్వింటాల్‌కు రూ.8 వేల నుంచి రూ.14 వేల వరకు ధర లభించింది. గతంలో ఇదే రకం క్వింటాల్ ధర రూ.22 వేలకు చేరుకొన్న రోజులున్నాయి. అమ్మకాలపరంగా ఎలాంటి తగ్గుదల నమోదు కాలేదు. రేటు తగ్గడంతో మార్కెట్ ఫీజు వసూళ్లు తగ్గాయి. ఇందుకు కారణాలపై ఆరా తీయగా తేజ మిరపకాయ బాగా పలచగా తయారు కావడం వల్ల ఆయిల్ కంపెనీలు ధర పెంచలేదని ఎక్స్‌పోర్టర్లు యార్డు అధికారులకు చెప్పారు.

నేర్చుకుని వస్తేనే..

లైసెన్స్!



డ్రైవింగ్ ట్రాక్‌లో ఏర్పాటు చేసిన సెన్సార్లు

డ్రైవింగ్ పరీక్షలకు వెళుతున్నారా.. జాగ్రత్తగా ఉండండి.. పూర్తి మెళకువలు నేర్చుకున్న తర్వాతే పరీక్షలకు హాజరుకండి. ఏజెంట్ల పైరవీలు, సిఫారస్సులతో డ్రైవింగ్ లైసెన్సులు దొరకవు. ఎట్టిపరిస్థితిల్లోనూ వాహనాన్ని నడపాల్సిందే. అందుకే పూర్తిగా శిక్షణ పొందిన తర్వాతే డ్రైవింగ్‌కు రండి. లేదంటే మీరు జీవితకాలం డ్రైవింగ్ లైసెన్స్‌కు దూరమవుతారు.

- అందుబాటులోకి ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్
- సీసీ కెమెరాలు, సెన్సార్ల పర్యవేక్షణ
- చిన్నపాటి పొరపాట్లకూ తిరస్కరణ
- గుంటూరులో మొదలైన నూతన విధానం

గుంటూరు(తూర్పు), మే 10(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ లైసెన్స్‌ల ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం మరింత క్లిష్టతరం చేసింది. గతంలో రవాణ వాహన తనిఖీ అధికారుల ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రక్రియను పూర్తిగా మార్చేసింది. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ అందుబాటులోకి తీసుకువచ్చి, ట్రాక్‌ల్లో సీసీ కెమెరాలు, సెన్సార్లను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రక్రియను నెట్ సొల్యూషన్స్ అనే సంస్థకు, డ్రైవింగ్ టెస్ట్ స్లాట్ బుక్ చేసేందుకు సారధి పోర్టల్‌ను అప్పజెప్పింది. దాదాపు రూ.కోటి నిధులు ఇందుకు ఖర్చుచేసింది. ఈ విధానం ద్వారా డ్రైవింగ్ టెస్ట్‌లో విజయవంతం అయితేనే లైసెన్స్ జారీ చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న 9 నగరాల్లో అమలు చేస్తున్న విధానాన్ని, 20 రోజుల క్రితం గుంటూరులో అందుబాటులోకి తీసుకువచ్చారు.

కష్టతరంగా మారిన ప్రక్రియ

నూతన విధానంలో గుంటూరులో రవాణ శాఖ కార్యాలయంలో 600 మీటర్ల డ్రైవింగ్ ట్రాక్‌లో మొత్తం 12 సెన్సార్లు ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనదారులు కాళ్లు కింద పెట్టినా, సరైన సమయంలో సిగ్నల్స్ ఆన్ చేయకపోయినా, ట్రాక్ పక్కనున్న గోడ లేదంటే సెన్సార్లకు తగిలినా, ఇతర చిన్న పొరపాట్లు చేసినా డ్రైవింగ్ టెస్టులో తక్కువ మార్కులు నమోదవుతున్నాయి. లైట్ మోటార్ వాహనాలకు స్టీరింగ్ ముందు కెమెరా కూడా ఏర్పాటు చేస్తున్నారు. తల ఎలా తిప్పుతున్నారో కూడా అందులో నమోదు అవుతున్నాయి. మొత్తం 12 సెన్సార్లలో ఎక్కువ పొరపాట్లు జరిగితే ఆ డ్రైవింగ్ టెస్ట్ ఫెయిల్‌గా, తక్కువ పొరపాట్లు నమోదైతే డ్రైవింగ్ లెసెన్స్ సక్సెస్ అని నమోదవుతుంది.

ఎక్కువమంది ఫెయిల్

దాదాపు 20 రోజులు క్రితం ప్రారంభమైన ఈ విధానంలో గుంటూరులో మొత్తం 1,100 మంది డ్రైవింగ్ టెస్ట్‌లకు హాజరైతే.. 300 మంది మాత్రమే లైసెన్స్ పొందారు. ఫెయిలైన వారికి రెండు నుంచి మూడుసార్లు అవకాశాన్ని కల్పిస్తున్నారు. అక్కడ కూడా ఫెయిల్ అయితే మరోసారి ఎల్ఎల్ఆర్ దరఖాస్తు చేసుకోవాల్సిందే. గత నాలుగు రోజుల నుంచి పదిమంది లోపే డ్రైవింగ్ పరీక్షలకు హాజరవుతున్నారు. అది కూడా విదేశాలకు, ఇతర అత్యవసరాలు, లేదంటే లైసెన్సును పొడిగించుకునే వారు మాత్రమే.


ముందస్తు అవగాహన తప్పనిసరి..

డ్రైవింగ్ టెస్ట్‌కు ముందు ఒక రోజు లేదా కనీసం గంట ముందైనా.. అవగాహన కల్పించాలి. ఎంపిక చేసిన నగరాల్లో డ్రైవింగ్ టెస్ట్‌కి ముందు 15 నిమిషాల వీడియోను వాహనదారులకు చూపించిన తర్వాతే ట్రాక్ పైకి పంపుతున్నారు. గుంటూరులో మాత్రం ఈ విధానం అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. నూతన డ్రైవింగ్ టెస్ట్ విధానాన్ని త్వరలోనే జిల్లా కేంద్రాలైన నరసరావుపేట, బాపట్లలో కూడా అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు.


అవగాహన కల్పిస్తాం




పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఒకరోజు ముందే ఈ విధానంపై పూర్తిగా అవగాహన కల్పించాలని ప్రభుత్వాన్ని కోరాం. అనుమతి రాగానే అమలు చేస్తాం. అంతేగాక సెన్సార్లలో నమోదు అవుతున్న చిన్నపాటి తప్పులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం. ప్రస్తుతం జరుగుతున్న విధానం అధికారుల పర్యవేక్షణలో ఉంది. కాబట్టి భయం వీడి పరీక్షలకు హాజరవ్వండి. - కె.సీతారామిరెడ్డి, జిల్లా రవాణా ఉప కమిషనర్, గుంటూరు



పీఎం కిసాన్ యోజన పేరుతో వాట్సప్‌లకు వస్తున్న మెసేజ్ ఇలా...



మన స్టేటస్ తెలుసుకునేందుకు దానిపై క్లిక్ చేస్తే హానికరమైన మెసేజ్ అని వస్తున్న హెచ్చరిక



హెచ్చరిక కూడా పట్టించుకోకుండా క్లిక్ చేస్తే ఇన్‌స్టాల్ అని రావటం, ప్రమాదకరమైన యాప్ ఇన్‌స్టాల్ కాగానే మన ఫోన్ హ్యాక్ కావటం



పవన్ కల్యాణ్ ప్రభుత్వం కొత్త రుణ పథకం పేరుతో సాంఘిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైన ప్రకటన

ఇదో.. కొత్త పేతకం!

- ప్రభుత్వ పథకాల పేరుతో వాట్సాప్ మెస్సేజ్‌లు
- నొక్కితే వ్యక్తిగత సమాచారం, నగదు నొక్కేస్తున్నారు..
- పీఎం కిసాన్ లబ్ధిదారులే టార్గెట్..
- డిప్యూటీ సీఎం పేరుతో.. రుణ పథకమంటూ నోటిఫికేషన్లు..

పవన్ కల్యాణ్ ప్రభుత్వ రుణ పథకం అంట..

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటో పెట్టి.. ఆయన ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణ పథకమంటూ.. ఇప్పుడు ప్రకటనలు వస్తున్నాయి. వడ్డీ లేకుండా ఆధార్ కార్డుపై రూ.లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు రుణాన్ని పొందొచ్చంటూ అందులో పొందుపరిచారు. ఇది నమ్మి రిజిస్ట్రేషన్ చేసుకున్నాక వారి మోసాన్ని గ్రహించేలోపే మొత్తం దోచేస్తున్నారు. జిల్లాలో చాలామంది వారి బారిన పడి డబ్బు పోగొట్టుకున్న ఘటనలున్నాయి.

తెనాలి, మే 10, (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ యోజన పేరుతో మనకు మెసేజ్ వస్తుంది. దీంతో డబ్బులు ఏమైనా..మన బ్యాంకు ఖాతాలో పడ్డాయని.. స్టేటస్ చూసుకుందామన్న ఆత్రుతతో నొక్కితే అంతే సంగతులు. ఫోన్ హ్యాక్ అవడం, హ్యాకర్ల చేతుల్లోకి మన పూర్తి సమాచారం వెళ్లిపోవడం.. క్షణాల్లో మన ఖాతాలో ఉన్న డబ్బు మాయమైపోవడం జరుగుతుంది. ఇదీ ప్రస్తుతం వాట్సాప్ యూజర్లను వణికిస్తున్న ఆన్‌లైన్ ఘరానా మోసం.

వాట్సాప్ ద్వారా వల..

వాట్సప్ గ్రూప్‌లే లక్ష్యంగా హ్యాకర్లు వల విసురుతున్నారు. మనకు తెలియకుండా బ్యాంకు ఖాతాలోని డబ్బు.. ఫోన్‌లోని సమాచారం మొత్తాన్ని దోచేస్తున్నారు. ఇదికాక ప్రముఖుల ఫొటోలు, ప్రభుత్వ అధికారిక ముద్రలు ఉపయోగించి రుణాల పేరుతో చేస్తున్న మోసాలకూ హద్దు లేకుండా పోతోంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణ పథకమంటూ తాజాగా కొత్త ప్రకటనలు సామాజిక మాధ్యమాల్లో పుట్టుకొచ్చాయి. డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలపై కేంద్ర ప్రభుత్వం అవగాహన కల్గించినా.. తాజాగా తెనాలికి చెందిన విశ్రాంత ఉద్యోగి రూ. 50 లక్షలు పోగొట్టుకున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ సైట్‌ల నుంచి వస్తున్నట్లు ప్రత్యక్షమయ్యే.. మెసేజ్‌లతో ఎంతమంది దగా పడుతున్నారనేది లెక్కకు అందని ప్రశ్నే.

పీఎం కిసాన్ పేరుతో..నయా మోసం

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఫిబ్రవరిలో 19వ విడత నగదును కేంద్రం రైతుల ఖాతాల్లో జమ చేసింది. 20 విడత జూన్‌లో లేదా జులైలో వేసే అవకాశం ఉంది. దీనికి సంబంధించి స్పష్టమైన తేదీని ప్రభుత్వం ప్రకటించలేదు. కనీసం రైతులకు రిజిస్ట్రేషన్, ఈకేవైసీ చేయాలనే ప్రకటనా చేయలేదు. కానీ, ఈ నెలలో దీనికి సంబంధించిన ఏపీకే మెసేజ్ ఒకటి వాట్సాప్ గ్రూప్‌లలో ప్రత్యక్షం అవుతోంది. కానీ, ఆత్రుతతో ఓపెన్ చేస్తే మోసపోతారు. పీఎం కిసాన్ మొత్తాన్ని రైతుల ఖాతాల్లోకి వేసే ముందు ప్రభుత్వం ఒక మెసేజ్, రైతుల వివరాలతో ఒక ఫైల్ వస్తుంది. అయితే వీటిని ఓపెన్ చేస్తే హానికరం అనే హెచ్చరికలు ఏవీ రావు. ఫైల్ బాగానే ఓపెన్ అవుతుంది. కానీ, ఈ కొత్త ఏపీకే మెసేజ్ ఓపెన్ చేస్తే.. మీ ఫోన్‌కు హానికరమంటూ హెచ్చరిక చూపిస్తుంది. ఆ మెసేజ్‌కు బయపడి వెనక్కు వచ్చేసినా ఇబ్బంది ఉండదు. కానీ ఓపెన్ అని నొక్కితే మాత్రం ఇన్‌స్టాల్ ఆప్షన్ వస్తోంది. కేంద్రం పంపే మెసేజ్‌లలో ఇలా ఇన్‌స్టాల్ ఆప్షన్ రాదు. దానిని కూడా పట్టించుకోకుండా ఇన్‌స్టాల్ అని నొక్కితే మాత్రం క్షణాల్లో మన ఫోన్ హ్యాక్ అయిపోతుంది. ఇది చాలదన్నట్లు మన వాట్సాప్ గ్రూప్‌లలో సభ్యులందరికీ వెళ్లిపోతుంది. కొందరు ఇటువంటి మెసేజ్ మాకెందుకు పంపావంటూ గొడవపడిన సందర్భాలూ ఉన్నాయి. తాజాగా తెనాలిలో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఇదే తరహా మెసేజ్ రావడంతో.. తన ఖాతాలో ఉన్న రూ. 66 వేలు మాయమైపోవడం క్షణాల్లో జరిగిపోయాయి. అయితే తనకు జరిగిన మోసం వెంటనే తెలుసుకుని 1930 నంబర్‌కు సమాచారం అందించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

సివిల్ డిఫెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : సివిల్ డిఫెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు అన్నారు. శనివారం భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో జిల్లా అధికారులతో టెలీకాన్ఫరేన్స్ ద్వారా అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ సైరన్ మోత వినబడినా, గాల్లో దాడులు గుర్తించినా ప్రమాదం పొంచి ఉన్నట్టు ప్రజలు గమనించాలని, సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని విజ్ఞప్తి చేశారు. దాడుల సమయంలో శత్రు దేశాల డ్రోన్లు గుర్తించకుండా సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ చేయడం, ఇళ్లలోని టీవీలు, దీపాలు ఆర్పి వేయాలని ప్రజలను కోరారు.

వైద్యమిత్రల సమస్యలను పరిష్కరించాలి

వినుకొండటౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దళిత గిరిజన వైద్యమిత్ర కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమైఖ్య ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ వైద్యసేవలో పనిచేస్తున్న వైద్యమిత్రల సమస్యలను పరిష్కరించాలంటూ వినుకొండకు వచ్చిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలను రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి కలిసి వినతిపత్రం అందజేశారు. గడిచిన 18 సంవత్సరాలుగా వైద్యమిత్రలుగా పని చేస్తున్నామని, అతితక్కువ వేతనంతో జీవనం సాగిస్తున్నామని వినతిపత్రంలో తెలిపారు.

12 నుంచి యోగా శిక్షణ శిబిరం

నరసరావుపేట టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): యోగా శిక్షణా శిబిరం ఈ నెల 12 నుంచి ప్రారంభమవుతుందని నిర్వాహకులు జల్లి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. పట్టణంలోని రావిపాడు రోడ్డులో ఉన్న ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు 28 రోజులుపాటు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అదనపు సమాచారం కోసం 9247191553 నంబరును సంప్రదించాలన్నారు.

వాసవీ దేవస్థానం అర్చకుడు మృతి

రొంపిచర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల గ్రామానికి చెందిన వాసవీ అమ్మవారి దేవస్థానం అర్చకుడు వాకాటి కోదండరామ దీక్షితులు అనారోగ్యంతో ఈ నెల 9వ తేదీన మృతి చెందారు. ఆయన అర్చకుడిగా, ఉపాధ్యాయుడిగా అందరికి సుపరిచితుడు. ఆయన మృతికి కమిటీ సభ్యులు, ఆర్యవైశ్యులు, గ్రామస్థులు సంతాపం తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

నాదెండ్ల, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్రులో విద్యుదాఘాతంతో మొగిలి రమేష్(36) అనే వ్యక్తి మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం నాదెండ్ల పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం రమేష్ తాపీ కార్మికుడిగా, భార్య విజయ లక్ష్మి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గడిచిన 8వ తేదీ రాత్రి తాపీ పనులకు పోయి వచ్చిన రమేష్‌ను ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్ ఆన్ చేశాడు. ఈ క్రమంలో ఒకేసారి విద్యుతాఘాతానికి గురయ్యాడు. కుటుంబసభ్యులు ఆయనను నరసరావుపేట ప్రభుత్వ ప్రాంతీయ ఆరోగ్యకేంద్రానికి ఆయనను ఆటోలో తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై దాడి

చిలకలూరిపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలిరెడ్డిపాలెంలో నివాసముంటున్న ఇంటూరి మణికంఠ(22) అనే యువకుడిని సమీపంలోని కొండ్రుపాడుకు చెందిన కొందరు మద్యం మత్తులో ఉన్న యువకులు గురువారం రాత్రి దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మణికంఠను తొలుత స్థానిక ప్రభుత్వాసుపత్రికి, అనంతరం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ఇందుకు సంబంధించి మణికంఠ శనివారం చిలకలూరిపేట అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ కారణంగా తనపై దాడి చేశారని ఫిర్యాదులో మణికంఠ పేర్కొన్నారు.

నేడు చిన్న సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి వార్షికోత్సవం

నరసరావుపేట టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలపాడు రోడ్డు ప్రశాంతి నగర్‌లోని శ్రీచిన్నసింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఏడో వార్షికోత్సవం ఆదివారం జరుగుతుందని కమిటీ సభ్యుడు బీ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, సువర్చలా హనుమత్ కల్యాణం, రాత్రి అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. 11 రోజుల పాటు హనుమజ్జయంతి వరకు విశేష పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం భారీ భోజన ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

● **ఈపూరు, మే 10(ఆంధ్రజ్యోతి):** మండలంలోని కొచ్చెర్లలో అంకాళ పరమేశ్వరీ అమ్మవారి కొలుపులు ఆదివారం నుంచి ప్రారంభమౌతాయని గ్రామస్థులు తెలిపారు. అంకాళపరమేశ్వరీ పావణంను భక్తులు జల బిందెలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆలయంలో ఉంచుతారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో సమ్మర్ క్యాంప్

నరసరావుపేట కల్చరల్, మే 10(ఆంధ్రజ్యోతి). మండలంలోని కేసానుపల్లిలో ఉన్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నందు శనివారం సమ్మర్ క్యాంపును స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఈ క్యాంపులో స్విమ్మింగ్, స్కేటింగ్, క్రికెట్, సంగీతం, యోగా, వాలీబాల్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారని స్కూల్ ప్రతినిధులు తెలిపారు. దీనితో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్‌ల నందు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సు ప్రముఖ శిక్షణ సంస్థ అలెన్ కెరీర్ ఇనిస్టిట్యూట్ వారి సౌజన్యంతో నిర్వహించారు. అలెన్ డిజటల్ హెడ్ సౌత్ ఇండియా శాఖాధిపతి డాక్టర్ డి.నాగార్జున ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పలు విలువైన సూచనలు చేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ నాగోతు ప్రకాష్‌రావు, డైరెక్టర్ నాగోతు సబిత, ప్రిన్సిపాల్ రేఖ ఫులేకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే కూటమి లక్ష్యం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

● మేజరు వద్ద మరమ్మతు పనులు ప్రారంభం



తంగేడుమల్లి మేజరు వద్ద పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

రొంపిచర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి) : రైతుల శ్రేయస్సే కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. మండలంలోని రొంపిచర్ల గ్రామంలో తంగేడుమల్లి మేజరులో మరమ్మతు పనులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకొనేందుకు కూటమి ప్రభుత్వం పాటు పడుతుందన్నారు. కాలువల ఆధునికీకరణ వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. కాలువల్లో పేరుకుపోయిన పిచ్చి చెట్లను తొలగించి నీరు సక్రమంగా రైతుల పొలాల్లోకి చేరేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల్లో ఒక్కసారి కూడా కాలువలను పట్టించు కోలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే 'పల్లెనిద్ర'

నరసరావుపేట రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజల నుంచి నేరు గా తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించేందు కు రాష్ట్ర ప్రభుత్వం పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టింద ని ఎమ్మెల్యే అరవిందబాబు తెలిపారు. కేతముక్కల అగ్రహారం నందు శుక్రవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్ర మంలో ఎమ్మెల్యే అరవిందబాబు పాల్గొన్నారు. గ్రామంలో ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుంచి నేరు గా సమస్యలను తెలుసుకోవడం కోసమే గ్రామా ల్లో సమస్యల పరిష్కార వేదిక పల్లెనిద్ర కార్య క్రమం అని ప్రతి హామీ అమలు చేసే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ, కూటమి నేతలు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు

అన్నవరప్పాడు మేజర్ కాలువకు మరమ్మతులు



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ సీతారామయ్య

వేల్పూరు(శావల్యాపురం), మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు గ్రామంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో ఉన్న అన్నవరప్పాడు మేజర్ కాలువ వద్ద మరమ్మతులు, అభివృద్ధి పనులను డీసీ చైర్మన్ గుత్తా సీతారామయ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహిం చారు. డీసీ చైర్మన్ సీతారామయ్య మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయకపోవడంతో కాలువకట్టల వెం బడి పిచ్చి చెట్లు పెరిగి, పూడిక పేరుకుపోయి అధ్వానంగా మారిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కెనాల్‌ల అభివృద్ధిపై ప్రత్యేక దష్టిని సారించిందన్నారు. ఎన్నెస్పీ నిధులు రూ.9లక్షలతో వేల్పూరు నుంచి అన్నవరప్పాడు వరకు 5కిమీ మేర కాలువ వెంబడి పిచ్చిచెట్ల తొలగింపు, కాలువలో పూడికతీత పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ పున్నమ్మ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుల సౌకర్యం కోసం 30 ఏళ్లలో కెనాల్ పరిధిలో కల్వర్ట్‌ల నిర్మాణాలకు పలుసార్లు శంకుస్థాపన చేసి నిలిపివేశారని, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సారథ్యంలో అన్నవరప్పాడు మేజర్‌కు మహర్దశ కలుగనుందన్నారు. ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు.

తెలుగు బాప్టిస్టు చర్చిలో ముగిసిన వీబీఎస్ తరగతులు



పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న చర్చి పెద్దలు

వినుకొండ, మే 10 (ఆంధ్రజ్యోతి): వినుకొండ తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో మూడు రోజులగా సాగిన సండేస్కూల్, వీబీఎస్ తరగతులు శనివారంతో ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో బాగంగా విద్యార్థులకు విరామ బైబిల్ పాఠశాలలో దేవుడి మాటలు, పాటలు, స్కిట్స్ నిర్వహించారు. కార్యక్రమంలో బాగంగా హైదరాబాద్ నుంచి పాల్గొన్న గ్రేస్ విద్యార్థులకు బైబిల్ సందేశాన్ని అందజేశారు. చివరిరోజు కార్యక్రమంలో బాగంగా సుమారు 16 సంఘాల నుండీ 400 మంది విద్యార్థులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ కాపరి జే స్వర్ణన్‌కుమార్, అధ్యక్షుడు సీహెచ్ రామయ్య, సెక్రటరీ ఆశీవందనం, ట్రెజరర్ పి.సునీల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ కె.వినోద్‌కుమార్, మేరి షారోన్ తదితరులు పాల్గొన్నారు.

లింగంగుంట్లలో పదో తరగతి విద్యార్థులకు సత్కారం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఈశ్వరరెడ్డి

నరసరావుపేట రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): లింగంగుంట్ల మాజీ సర్పంచ్ నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి పుట్టినరోజు సందర్భంగా పదో తరగతి మెరిట్ విద్యార్థులను సత్కరించారు. లింగంగుంట్లలోని రామాలయంలో పదో తరగతి మెరిట్ విద్యార్థులకు పొన్నపాటి పేరిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరపున అభినందన సభ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం పది పరీక్షల్లో 550 నుంచి 590 వరకు మార్కులు సాధించిన లింగంగుంట్ల గ్రామ విద్యార్థులను ఘనంగా సత్కరించి వారికి నగదు బహుమతులను అందజేశారు. అదే విధంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించి 2116 నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత హెడ్ మాస్టర్ కందుల రామకోటి రెడ్డి, కేర్ స్కూలు డైరెక్టర్ కీసర కోటి రెడ్డి, విశ్రాంత లెక్చరర్ వై రాజారెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జాయింట్ కార్యదర్శి షేక్ బాజీ, కందుల విద్యాసాగర్‌రెడ్డి, సరికొండ మురళి, ఏలూరు మహేష్ రెడ్డి ,శనివారపు రామకృష్ణారెడ్డి, శ్రీనాథ సాహితీ పరిషత్తు కార్యదర్శి స్వర్ణ రామిరెడ్డి పొన్నపాటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరులో కొనసాగుతున్న పంటల దహనం

వేల్పూరు(శావల్యాపురం), మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన రైతులు లక్షల కొద్దీ పెట్టుబడులు పెట్టి ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను కొందరు వ్యక్తులు నిప్పంటించి తగుల బెడుతున్న సంఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామానికి చెందిన కొనకంచి వెంకటేశ్వర్లు వేల్పూరు నుంచి ఇర్లపాడుకు వెళ్లే డొంక మార్గంలో పెదకాలువ సమీపంలో 1.25 ఎకరాల్లో వరి కోతకోసి గూడు వేశాడు. శనివారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు దానికి నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. పంట నూర్పిడికి అటుగా వెళుతున్న కూలీలు దాన్ని గమనించి బాధితుడు వెంకటేశ్వర్లుకు తెలియజేశారు. వెంకటేశ్వర్లు గ్రామస్థులతో వెళ్ళి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేదు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు ఆర్పేలోపే పంటగూడు మొత్తం కాలిపోయింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. పంటవిలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితులు వాపోయారు. ఇటీవల గ్రామంలో మేడిబోయిన వెంకటేశ్వర్లు, సాదినేని వీరాంజనేయులు, దొప్పలపూడి శ్రీనివాసరావు పొలాల్లో పొగాకుబేళ్ళు, వరికుప్పలు దహనం చేశారు. అదే గ్రామానికి చెందిన బొల్లా విజయబాబు అలియాస్ బుజ్జి వాటిలో రెండింటికి నిప్పంటించినట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలడంతో కేసు నమోదు చేశారు. అంతలోనే మరో ఘటన జరగడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

నలగార్లపాడులో ఐదు ఎకరాల గడ్డి వామి దగ్ధం

రొంపిచర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నలగార్లపాడు గ్రామంలో ఐదు ఎకరాల గడ్డి వామి శనివారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఎగిటి వెంకటేశ్వర్లు, ఆంజనేయులుకు చెందిన గడ్డి వాములు దగ్ధమయ్యాయి. పక్క పక్కనే ఉండటంతో రెండు దగ్ధమయ్యాయి. సుమారు రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధితులు తెలిపారు. ఘటనా స్థలానికి ఫైర్ స్టేషన్ సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి గల కారణాలు తెలి యరాలేదు.

పిడుగుపాటుతో పంట గూడు దగ్ధం

పోట్లూరు(శావల్యాపురం), మే 10(ఆంధ్రజ్యోతి): పొలాల్లో వేసియున్న పంటగూడుపై పిడుగుపడటంతో దగ్ధమైన ఘటన మండలంలోని పోట్లూరు గ్రామంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన చేకూరి శ్రీనివాసరావు కృష్ణాపురం వెళ్లే దారిలో ఉన్న మేజర్‌కాలువ వెంబడి ఎకరం వరిపంట కోతకోసి గూడు వేశాడు. శనివారం సాయంత్రం పంటగూడుపై పిడుగుపడడంతో మంటలు చెలరేగాయి. స్థానికుల ద్వారా విషయం తెలుసుకొన్న బాధితుడు శ్రీనివాసరావు పొలానికెళ్ళి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అప్పటికే మొత్తం కాలిపోయింది. పంట విలువ సుమారుగా రూ.60వేల వరకు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

చెట్లపై పడిన పిడుగులు..

ఈపూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొత్తనెల్లూరులో మక్కెన తిరుపతయ్య ఇంటి ఆవరణలో కొబ్బరిచెట్టుపై పడింది. అదే సమయంలో గృహాల్లో ఎలక్ట్రికల్ పరికరాలు (టీవీలు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, కూలర్లు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో అందరు ఇళ్ళల్లో ఉండడంతో ఎవరికి ఏమీ కాలేదు. అదేవిధంగా ఈపూరు సొసైటీ కార్యాలయం వెనుక వైపు పొలాల్లో తాటి చెట్టుపై పిడుగు పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

విద్యుత్ ఉద్యోగి బంగారయ్య పార్టీలో చేరారు

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల క్రితం సీఎం చంద్రబాబు నాయుడుని కలిశాను. ఎనిమిది నెలల క్రితం ఒక అసైన్‌మెంట్ నాకు అప్పగించారు. ఆ ఫైల్ తీసుకొని చంద్రబాబు దగ్గరకు వెళ్లాను. నాతో పాటు విద్యుత్‌శాఖ ఉద్యోగి బంగారయ్యను కూడా తీసుకువెళ్లానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. తమ పని కోసమే బంగారయ్యను చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లానన్నారు. రెండు నెలల క్రితమే బంగారయ్య వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చారు. అసైన్‌మెంట్‌ను పూర్తి చేసి వివరాలను చంద్రబాబుకు అందజేశాను. అది చాలా పెద్దది.. సిక్రెట్ అసైన్‌మెంట్‌ను అధికారంలోకి రాగానే నాకే అప్పగించారు. దానిని నేను చేసి పెట్టాను. దానిని బయట పెట్టడం మంచి పద్ధతి కాదని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. కొందరికి శిక్ష కూడా పడుతుందన్నారు. ఇక్కడ శనివారం జరిగిన ఒక సమావేశంలో ఆంధ్రజ్యోతిలో వెలువడిన టీడీపీ శ్రేణులకు విద్యుత్ ఉద్యోగి షాక్ అనే శీర్షికతో వార్తను ప్రస్తావించారు. చంద్రబాబు, నారా లోకేశ్‌పై బంగారయ్య సోషల్ మీడియాలో చేసిన పోస్టుల అంశాన్ని మాత్రం ఎమ్మెల్యే ప్రస్తావించకపోవడం గమనార్హం. బంగారయ్యను టీడీపీలో చేర్చుకున్నట్లు అరవిందబాబు వెల్లడించి టీడీపీ శ్రేణుల్లో ఉన్న అనుమానాలను ఆయన నివృతి చేశారు. తాను చేసే మంచి పనులు.. పోరాటాలను ఫోకస్ చేయమని ప్రతి పక్షంలో ఉండగా మీడియాను కోరాను. ఇప్పుడు తాను చేసే మంచి పనులు ఫోకస్ చేయాలన్నారు. మీడియాలో కొన్ని అనవసరమైన వార్తలు రాస్తుంటారని అరవిందబాబు అక్కసు వెళ్లగక్కారు.

కళాశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళమిచ్చిన దంపతులను సత్కరించిన కళాశాల కమిటీ కార్యవర్గం

చిలకలూరిపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): తాము పనిచేసిన కళాశాల అభివృద్ధి కోసం రూ.లక్ష విరాళం ఇచ్చి ఆ దంపతులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. స్థానిక డీఆర్ఎన్ఎస్ సీవీఎస్ డిగ్రీ కళాశాలలో నాన్ టీచింగ్ ఉద్యోగులుగా కాకుమాను పుల్లారావు, వెంకట నరసమ్మ దంపతులు నాలుగు దశాబ్దాల పాటు పనిచేశారు. వారిద్దరూ రిటైర్ అయ్యారు. వారికి వచ్చిన పెన్షన్ మొత్తంలో కళాశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళాన్ని చిలకలూరిపేట విద్యాసంఘం అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు, కార్యదర్శి షైలవరపు శివానందకుమార్‌లకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పుల్లారావు, వెంకట నరసమ్మ దంపతులను కళాశాల కమిటీ వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ కోశాధికారి బచ్చు రామలింగేశ్వరరావు, దాతల కుటుంబసభ్యులు కాకుమాను రమేష్, కాకుమాను వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె



పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

నరసరావుపేట టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : పనిచేసిన అన్ని రోజులకు వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారం 52 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద పొర్లు దండాలు పెట్టి వినూత్నంగా నిరసన తెలియజేశారు. కార్మికుల న్యాయమైన సమస్యను పరిష్కారం చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేసి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

కొచ్చెర్లలో చెత్తసేకరణ ప్రారంభం



చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

ఈపూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్ల పంచాయతీ పరిధి లో నిలిచిన చెత్తసేకరణ అంటూ ఆంధ్రజ్యోతిలో ప్ర చురిత మైన కథనానికి స్పం దించిన అధికారులు చర్యలు తీసుకున్నారు. కార్మికులకు బకాయిపడిన వేతనాలు వారి ఖాతాలకు జమచేయడంతో శనివారం గ్రామంలో చెత్త సేకరణ చేపట్టారు.

రామాలయం పాలకమండలి చైర్మన్‌గా భాస్కరరావు

చిలకలూరిపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న శ్రీసీతారామస్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా గ్రంధి భాస్కరరావు నియమితులయ్యారు. పాలక మండలి సభ్యులుగా మరో 8మంది నియమితులయ్యారు. వారిలో అర్వపల్లి వీరాంజనేయులు, గంజి మహాలక్ష్మి, కోడూరి శ్రీనివాస రావు, జరపల మోతిబాయ్, అమ్మనబ్రోలు దేవకీబాయ్, సంగవ రపు గోపీనాథ శాస్త్రి, జీ ధనాంజలి, వెల్లంపల్లి శ్రీరాములు ఉన్నారు. దేవదాయశాఖ ఈ నియామకాలు జరిపింది.

20న నిర్వహించే సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

నరసరావుపేట టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని మే 20న నిర్వహించే సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులునాయక్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్మికుల జనరల్‌బాడీ సమావేశంలో ఈ విషయం తెలిపారు.

ఘనంగా రంగనాయకస్వామి తిరునాళ్ల



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న చీఫ్‌విప్ జీవీ, మక్కెన

వినుకొండటౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాయపాలెం పంచాయతీ పరిధిలోని రంగనాయకస్వామి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులు వేకువజామున నుంచి స్వామికి పొంగళ్లు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవదాయ, ఆలయ కమిటీసభ్యులు చీఫ్‌విప్ జీవీ, మక్కెనలను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాదినేని ఆంజనేయులు, ఆలయ కమిటీ ఈవో ప్రభాకరరెడ్డి, సురేష్, నరేంద్ర, నర్రా కిషోర్, కొండలు, భక్తులు పాల్గొన్నారు.

● మండలంలోని మదమంచిపాడులో ఉన్న వీరాంజనేయస్వామిని జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

కూటమితోనే బీసీల సంక్షేమం, అభ్యున్నతి

● నాయీ బ్రహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్



జీవోలు తిరిగి అమలు చేయాలని మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న గంగాధర్

నరసరావుపేట టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమం, అభ్యున్నతి కూటమితోనే సాధ్యమని నాయీ బ్రహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నాయీ బ్రహ్మణ సామాజికవర్గ సమస్యల పరిష్కారం కోసం కొన్ని జీవోలు, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ జీవోలు అమలు చేయకపోగా అనేక సంక్షేమ పథకాలు నిలిపివేశారన్నారు. దీనివల్ల నాయీబ్రహ్మణులు సామాజికంగా, ఆర్థికం గా చాలా నష్టపోయారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేసిన 13, 14, 26, 10 జీవోలను తిరిగి అమలు చేయాలని కోరారు. రాజధాని అమరావతిలో ఐదు ఎక రాలు స్థలం కేటాయించి నాయీబ్రహ్మణ సంగీత పాఠశాలను (డోలు, నాదస్వ రం) ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో బీసీల అభ్యున్నతి కోసం ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా నారా చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తూ బీసీల ఆత్మబంధువుగా మారారని చెప్పారు. గంగాధర్ శనివారం తాడేపల్లిలో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు పలు విషయాలపై వినతిపత్రం అందజేశారు.

వైభవంగా శ్రీభీమలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం



స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): పాతూరులోని శివాలయంలో శ్రీగంగా పార్వతీ సమేత భీమలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే అరవిందబాబు దంపతులు స్వామికి తలంబ్రాలు సమర్పించి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి రుద్రాభిషేకం, అమ్మ వారికి కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. 50 ఏళ్ల అనంత రం స్వామి రథోత్సవం ఆదివా రం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నారు.

రేపు శ్రీత్రికోటేశ్వర స్వామికి లక్ష మల్లెలతో పత్యేక పూజలు

కోటప్పకొండలో వైశాఖ పౌర్ణమి పురష్కరించుకొని శ్రీత్రికోటేశ్వర స్వామికి లక్ష మల్లెలతో ప్రత్యేక పూజలు సోమవారం సాయంత్రం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో డీ చంద్రశేఖరరావు శనివారం తెలిపారు. పూజా కార్యక్రమల్లో భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

త్రివిధ దళాలకు విజయం చేకూరాలని ప్రత్యేక పూజలు

వినుకొండటౌన్, మే 10, (ఆంధ్రజ్యోతి) ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న త్రివిధ దళాలకు విజయం చేకూరాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో పుట్టాబత్తుని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు యార్లగడ్డ లెనిన్ మాట్లాడుతూ మన సైనికులు దేశ సరిహద్దులను కాపాడుతూ రాత్రి పగలు కష్టపడుతున్నారని, వారి త్యాగాలను మనం ఎప్పటికీ మర్చి పోకూడదని, మన సైనికులకు మనందరి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. వారి ధైర్య సాహసాలు అందరికీ స్పూర్తినిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో రాఘవలు, పట్టణ అధ్యక్షులు సుధాకర్, అంబటి వెంకటరెడ్డి, తిలక్ నాయక్, సుదా గణేష్, దేసు లక్ష్మీ నారాయణ, మహిళా నాయకులు పాల్గొన్నారు.